ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY








శనివారం 03 అక్టోబర్ 2026 | Saturday 03 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 169 | Vol.No 28 Issue No .169 | www.visionandhra.in


## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.9.17 కోట్ల విరాళం

- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రల్ కిచెన్లు
- నవంబర్ 30లోగా నిర్మాణాలు పూర్తి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి
- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించే పథకం అమలులో భాగంగా నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో హరే కృష్ణ ఫౌండేషన్‌తో ఆయా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మిగతా 2లో..



## బాపూఘాట్‌లో గాంధీజీకి ఘన నివాళులు

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి

హైదరాబాద్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు మిగతా 2లో..



## మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్..

### అధికారికంగా ప్రారంభించిన ప్రభుత్వం




హైదరాబాద్, అక్టోబర్ 02 హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రయాణీకుల రవాణా అవసరాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రయాణించే పౌరుల మిగతా 2లో..

# జల సంక్షోభం దిశగా రాష్ట్రం!?

- పడిపోయిన భూగర్భ జలాలు
- తాగునీటి సమస్య జటిలం
- తుడిచిపెట్టిన వానాకాలం..
- అడుగంటిన జలాశయాలు




హైదరాబాద్, అక్టోబర్ 02 : వానాకాలం వెళ్లిపోయింది. కానీ తెలంగాణలో నీటి టెన్షన్ మొదలైంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి వానలు ఆశించినంతగా పడలేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణంగా పడాల్సిన వానతో పోలిస్తే 17 శాతం లోటు నమోదైంది. 33 జిల్లాల్లో ఏకంగా 18 జిల్లాలు వర్షాభావంలోనే ముగిశాయి. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రం మొత్తానికి లెక్క వేస్తే వాన కొంత పడినట్టే కనిపిస్తుంది. కానీ పల్లెకు వెళ్లి చూస్తే అసలు కథ తెలుస్తుంది. ఒక చోట వాన పడితే, మరోచోట చినుకు కూడా సరిగ్గా పడలేదు. ఒక్క చెట్టు నీడతో అడవి చల్లబడుతుందా అన్న తీరులో కొన్ని ప్రాంతాల్లో పడిన వాన రాష్ట్రం మొత్తం లోటును పూడ్చలేకపోయింది. 2023లో తెలంగాణలో 861 మి.మీ. వర్షం పడింది. అది సాధారణం కంటే 17 శాతం ఎక్కువ. ఇప్పుడు మాత్రం సాధారణ వర్షపాతం కంటే 17 శాతం లోటు నమోదైంది. రెండేళ్లలోనే వాన లెక్క తలకిందులైంది. ఇక అసలు చిక్కు నీళ్ల దగ్గర మొదలవుతుంది. సెప్టెంబర్ 30 నాటికి కృష్ణా, గోదావరి పరిధిలోని తెలంగాణ రిజర్వాయర్లలో కలిపి సుమారు 503 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ నిల్వ 835 టీఎంసీలకు పైగా ఉంది. అంటే ఏడాదిలో దాదాపు 331 టీఎంసీల తేడా కనిపిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఈసారి 323 టీఎంసీలకు పైగా నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 583 టీఎంసీలకు పైగా మిగతా 2లో..

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

- 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ జట్టు
- ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం



న్యూఢిల్లీ, అక్టోబర్ 02 : భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన మిగతా 2లో..

## గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన
- వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 02 : గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే మిగతా 2లో..



## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ మిగతా 2లో..



## రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది

- అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పడుతున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు
- బీజేపీలో చేరిన పలుయ్యురు సీరియల్ నటులు..
- ఆహ్వానించిన బీజేపీ బాస్ రాంచందర్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 02 : తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు మిగతా 2లో..

## మహాత్ముడి నిజమైన వారసులు బీజేపీయే

- గాంధీ ఆశయాలను నెరవేరుస్తున్న మోదీ,
- గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా,
- ఓటమి తర్వాత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం,
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీజేపీని గెలిపిస్తాం,
- హిందూ ఓట్లను ఏకం చేసి గెలిచితీరుతాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 02 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం మిగతా 2లో..



## రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు ఛార్జీలకు అనుమతి
- అధికారికంగా జీవో జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 02 : ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వ ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం రేవంత్ సర్కార్ అధికారికంగా ఒక జీవో కూడా జారీ చేసింది. ఆటోల కనీస చార్జీని రూ. 20 నుంచి రూ. 30కి మిగతా 2లో..



## పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు



- పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై ప్రజలు దృష్టి పెట్టాలి
- చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నాం
- స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

విజయవాడ, అక్టోబర్ 02 : పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని మిగతా 2లో..

# ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్

- ఇంటిని చక్కదిద్దుతున్నట్లు దేశాన్ని నిర్మల తీర్చిదిద్దుతున్నారు
- ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ఆర్థిక శాఖ అప్పగింత
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంశలు
- ఈ పరిశ్రమతో కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన లో చంద్రబాబు
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన







మదనపల్లె, అక్టోబర్ 02 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక 'ఉక్కు మహిళ' అని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలతో ముంచెత్తారు. ఓ మహిళ ఇంటిని ఎంత చక్కగా తీర్చిదిద్దగలదో, అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించారని చంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మిగతా 2లో..

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

మదనపల్లె, అక్టోబర్ 02 : రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మిగతా 2లో..



## గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది

కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

## మహాత్ముడి నిజమైన వారసులు బీజేపీయే

తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్ ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.9.17 కోట్ల విరాళం

జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు రూ.5.17 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. అదేవిధంగా వికారాబాద్‌లో ఆధునిక సెంట్రల్ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరఫున సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ.4 కోట్ల చెక్కును అందించారు. మొత్తం రూ.9.17 కోట్ల విరాళాలను అందించిన సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల శారీరక ఎదుగుదల, విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేస్తూ ట్రాక్ రికార్డును నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారంలోని క్యాలరీలను లెక్కించేందుకు యాప్‌లను వినియోగించుకోవాలని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ పథకం వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకోవడంతోపాటు వారి ఆరోగ్యం, విద్యా సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రాంతాలవారీగా స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా అల్పాహారాన్ని సిద్ధం చేయాలని సూచించారు.

నవంబర్ 30లోగా కిచెన్ల నిర్మాణాలు పూర్తి

సెంట్రలైజ్డ్ కిచెన్ల నిర్మాణాలను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని సెంట్రల్ కిచెన్లను ఒకేసారి ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగాల్సి ఉన్నందున ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సెంట్రల్ కిచెన్లను సందర్శించేలా చర్యలు చేపట్టి, ఆహార తయారీ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## బాపూఘాట్‌లో గాంధీజీకి ఘన నివాళులు

భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా గాంధీజీకి నివాళులర్పించారు.

# జల సంక్షోభం దిశగా రాష్ట్రం!?

ఉంది. గోదావరి బేసిన్‌లోనూ ఈసారి సుమారు 180 టీఎంసీలు ఉంటే.. గత ఏడాది 252 టీఎంసీలకు పైగా నిల్వ ఉంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ లెక్కలు చూస్తే నీటి కొరత మరింత స్పష్టంగా కనిపిస్తోంది. శ్రీశైలంలో గతేడాది 153.56 టీఎంసీలు ఉంటే.. ఈసారి 61.65 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. నాగార్జునసాగర్‌లో గతేడాది 174.25 టీఎంసీలు ఉంటే.. ఈసారి 44.89 టీఎంసీలకు పడిపోయింది.తెలంగాణలో దాదాపు 44 వేల చెరువులు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 శాతం చెరువులు పావు వంతు కూడా నిండలేదని ప్రభుత్వం తెలిపింది. చెరువు నిండితే బోరుకు ఊపిరి. చెరువు ఎండితే పల్లెకు కష్టం. చెరువు నిండితే ఊరు నిండినట్టే అనే పాత మాట ఇప్పుడు మళ్లీ గుర్తుకొస్తోంది. చెరువుల్లో నీరు లేకపోతే భూగర్భ జలాలు కూడా పెరగవు. సెప్టెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో భూగర్భ జలాల సగటు లోతు 11.24 మీటర్లకు చేరింది. నెల మొదట్లో అది 7.52 మీటర్లుగా ఉండి. అంటే నెల రోజుల్లోనే నీటి మట్టం గణనీయంగా దిగింది. బోరు లోతు పెరిగితే మోటారు ఖర్చు పెరుగుతుంది. డీజిల్‌తో నీళ్లు తోడితే రైతు ఖర్చు మరింత పెరుగుతుంది. వాన కోసం ఆకాశం వైపు, నీళ్ల కోసం బోరు వైపు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 123.74 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. గత ఏడాది ఇదే సమయంలో 139.29 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. అంటే దాదాపు 15.55 లక్షల ఎకరాలు తగ్గాయి. వరి సాగు కూడా గత ఏడాదితో పోలిస్తే దాదాపు 18 శాతం తగ్గింది. నీరు పుష్కలంగా ఉండే పంటల నుంచి తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని రైతులకు సూచిస్తున్నారు. రైతు పరిస్థితి మాత్రం లెక్కల్లో కనిపించినంత తేలిక కాదు. విత్తనం వేసి పంట పెంచాడు. మధ్యలో వాన ముఖం చాటేస్తే పెట్టుబడి పోతుంది. బోరు నీటితో కాపాడాలంటే మరో ఖర్చు. నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట చేతికి రాకపోతే రైతు చేతిలో మిగిలేది అప్పే. ఇక తాగునీటి లెక్క కూడా ఇప్పుడు కీలకంగా మారింది. హైదరాబాద్‌కు నీరు అందించే సింగూర్ వంటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. సరఫరా కొనసాగుతున్నా రాబోయే నెలల్లో నిల్వలు తగ్గితే ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అంటే సమస్య రైతు పొలంలోనే కాదు. ఇంటి కుండ దగ్గర కూడా ఉంది. సాగుకు నీళ్లు కావాలి. పల్లెకు తాగునీరు కావాలి. పట్టణాలకు నీరు కావాలి. నీరు తగ్గినప్పుడు ముందు ఎవరి అవసరం తీరాలి అన్నదే అసలు సవాల్.ఇందుకే ప్రభుత్వం ఇప్పుడు అలర్ట్ సమావేశాలకు సిద్ధమవుతోంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాల లోటు, కరువు పరిస్థితులపై అన్ని పార్టీల సలహాలు తీసుకోనుంది. కేబినెట్ సబ్‌కమిటీ కూడా పరిస్థితిని అధ్యయనం చేయనుంది. కానీ పల్లెకు కావాల్సింది సమావేశాలు కాదు. నీళ్లు. రైతుకు కావాల్సింది మాటలు కాదు. పంటకు నీరు. ఇంటికి కుళాయి వస్తుందన్న నమ్మకం కావాలి. బోరు ఎండిపోతుందేమో అన్న భయం పోవాలి. ముందు జాగ్రత్త మేలు అన్న తీరులో ఇప్పుడు నీటి లెక్క ముందే వేసుకోవాల్సిన సమయం. వానాకాలం ముగిసింది. రిజర్వాయర్లలో నీళ్లు గత ఏడాదికంటే చాలా తక్కువగా ఉన్నాయి. చెరువుల్లో నిల్వలు తగ్గాయి. భూగర్భ జలాలు దిగుతున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గింది. వాన తగ్గింది. నీళ్లు తగ్గాయి. ఇప్పుడు ప్రభుత్వానికి అసలు పరీక్ష మొదలైంది. తెలంగాణలో కరువు తలుపు తడుతోందా అన్న ప్రశ్నకు లెక్కలు మాత్రం గట్టిగానే హెచ్చరిస్తున్నాయి.మరోవైపు హైదరాబాద్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. గతేడాది సెప్టెంబరులో జిల్లా సగటు 3.57 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 10.01 మీటర్లకు పడిపోయింది. మేడ్చల్-మల్కాజిగిరిలో 11.64 మీటర్లు, వికారాబాద్‌లో 11.96 మీటర్లు, రంగారెడ్డిలో 11.74 మీటర్లు, మహబూబ్‌నగర్‌లో 10.51 మీటర్లు, సంగారెడ్డిలో 11.21 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది . బోర్లు ఇప్పటికే చుక్క నీరు రాకుండా మారుతున్న ప్రాంతాలు ఉన్నాయి . నగరాల్లోనూ, పల్లెల్లోనూ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యం కావడం, వర్షపాతం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. రాష్ట్ర సగటు వర్షపాతం 18 శాతం లోటుతో నమోదైంది. నల్గొండ, నిర్మల్, హైదరాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ తదితర 19 జిల్లాల్లో తీవ్ర వర్షపాత లోటు నమోదైంది. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అధికంగా అడుగంటాయి. పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల వంటి కొన్ని జిల్లాల్లో మాత్రమే కొంత మెరుగైన పరిస్థితి కనిపిస్తోంది. అయినా మొత్తంగా రాష్ట్ర పరిస్థితి ఆశాజనకంగా లేదు. వాతావరణ శాఖ ప్రకారం ఇకపై పెద్దగా వర్షాలు రావు. అంటే నేలలోకి ఇంకే నీరు మరింత తగ్గుతుంది. అక్టోబరు నుంచి వచ్చే ఏడాది మే నెల వరకు తాగునీటి సమస్య కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్ కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నీటిని ప్రతి ఒక్కరు బాధ్యతగా, పొదుపుగా వాడుకోవాలి. వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని స్పష్టం చేశారు. జలాశయాలు నిండకపోవడం, చెరువులు ఎండిపోవడం, బోర్లు వట్టిపోవడం ఇవన్నీ కలిసి రాష్ట్రంలో తీవ్ర జల సంక్షోభం ముంచుకొస్తోందని, కనుక నీళ్ళను ఇప్పటి నుండే పొదుపుగా వాడాల్సిన అవసరం స్పష్టమవుతోంది. ప్రజలు, ప్రభుత్వం కలిసి నీటి పొదుపు చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

# రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

పెంచుతున్నట్లు జీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీవో 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలోమీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ.15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆటో డ్రైవర్లు సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లకు ఊరట కల్పిస్తూ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా.. సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.

## మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్..

కోసం హైదరాబాద్ మెట్రో, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) సంయుక్తంగా రూపొందించిన ఒకే ఉమ్మడి పాస్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ నూతన కామన్ పాస్‌ను ఆవిష్కరించారు. ఈ కామన్ పాస్ ఆవిష్కరణ వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరాటంకమైన, సులభతరమైన, సమగ్ర ప్రజారవాణా అనుసంధానాన్ని కల్పించడమే. నిత్యం లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలో ప్రయాణాల కోసం బస్సులు, మెట్రో రైళ్లపై ఆధారపడుతుంటారు. ఇప్పటివరకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి రావడం వల్ల సమయం వృథా అవ్వడంతో పాటు ఇబ్బందులు ఎదురవుతుండేవి. ఈ కొత్త విధానం ద్వారా ప్రయాణీకులు ఒక్క కార్డుతోనే రెండు రవాణా వ్యవస్థల సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ కామన్ పాస్‌లలో రోజువారీ, నెలవారీ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ ధరను రూ.400గా నిర్ణయించారు. ఇందులో మెట్రో ప్రయాణ ఛార్జీ కింద రూ.300 , ఆర్టీసీ ప్రయాణ ఛార్జీ కింద రూ.100 వేర్వేరుగా లెక్కించబడతాయి. అలాగే రోజూ ప్రయాణించే వారి కోసం నెలవారీ ఉమ్మడి పాస్‌ను రూ.8,500లకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెలవారీ పాస్‌లో మెట్రో వాటా రూ.7,000 కాగా.. ఆర్టీసీ వాటా రూ.1,500గా లెక్కించబడతాయి. ఈ స్మార్ట్ కార్డ్ డిపాజిట్, వినియోగ నిబంధనలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రయాణీకులు మొదటిసారి ఈ కార్డును కొనుగోలు చేసేటప్పుడు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ భవిష్యత్తులో ఈ కార్డు అవసరం లేదనుకుని ఆర్టీసీ లేదా మెట్రో యాజమాన్యానికి తిరిగి ఇచ్చేస్తే ఆ రూ.100 డిపాజిట్ సొమ్మును ప్రయాణీకుడికి తిరిగి వాపసు చేస్తారు. ఈ కామన్ పాస్ వినియోగం లిమిట్స్ విషయానికి వస్తేయ.. ఔటర్ రింగ్ రోడ్(రా==) పరిధి లోపల నడిచే అన్న రకాల ఆర్టీసీ సిటీ బస్సులతో పాటు మెట్రో రైళ్లన్నింటిలోనూ ప్రయాణించడానికి ఇది వర్తిస్తుంది. సిటీ సాధారణ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే ప్రత్యేక ఏసీ బస్సులు అయిన 'పుష్పక్' సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తిందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నూతన ఉమ్మడి పాస్ విధానం వల్ల నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రజారవాణా వినియోగం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది.

ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

## ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్

మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ , ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA) శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఘనత నిర్మలా సీతారామన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వ సహకారమే కారణమని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ముఖ్యంగా, మదనపల్లెలో ఏర్పాటు కానున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం నిధుల కేటాయింపులో నిర్మలా సీతారామన్ చూపిన చొరవ, అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.కాగా "అనంత్ అంబానీ... మీరు ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అంతకుముందు, సభలో ప్రసంగించిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు. కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు. ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. కాగా ప్రభుత్వ కార్యక్రమాల్లో క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, సభా మర్యాదను ప్రతి ఒక్కరూ పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మదనపల్లెలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగానికి కొందరు యువకులు అంతరాయం కలిగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరుపై వేదిక నుంచే మండిపడ్డారు. నిర్మలా సీతారామన్ తెలుగులో ప్రసంగిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సభకు హాజరైన వారిలో కొందరు యువకులు ఈలలు వేస్తూ, కేకలు పెడుతూ నినాదాలతో గందరగోళం సృష్టించారు. ఆమె ప్రసంగానికి పదేపదే అడ్డుతగలడంతో వేదికపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకున్నారు. వెంటనే తన చైర్ నుంచి లేచి వెళ్లి మైక్ అందుకున్న చంద్రబాబు, యువకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి ప్రసంగిస్తున్నప్పుడు ఇలా క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించడం సరికాదు. ఇది మంచి పద్ధతి కాదు. సభకు ఒక గౌరవం ఉంటుంది, దానిని కాపాడాలి" అంటూ గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆగ్రహంతో ఒక్కసారిగా సభలో నిశ్శబ్దం అలుముకుంది. అయితే, ఈ గందరగోళం మధ్య కూడా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంయమనం కోల్పోలేదు. ఆమె తన ప్రసంగాన్ని తెలుగులోనే కొనసాగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు

అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అమెరికా వెళ్లాలి.. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవాలి' అని భారత్‌లోని సగటు యువతలో చాలామంది ఆశపడుతూ ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అక్కడి విదేశీ విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు చల్లడం ప్రారంభించారు. ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓూ.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఓూ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది. ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ఇక్కడా సవాళ్లు తప్పడం లేదు! విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి. ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది. ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. హెచ్-1బీ వీసా చార్జీలు అనూహ్యంగా పెంచడమే కాక, విద్యార్థి వీసాలపై వచ్చే వారిపై కఠిన నిబంధనలు విధించారు. దీంతో అక్కడ ఉంటున్న ఇండియన్స్ సహా ఇతర దేశస్థులకు ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాక, ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. హెచ్-1బీ వీసా కింద నియామకాలు తగ్గించి స్థానికులనే నియమించుకోవడం మెల్లిగా ప్రారంభించాయి. డాలర్ల సంపాదన లక్ష్యానికి ట్రంప్ దెబ్బకొట్టడంతో అమెరికాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పోనీ ఎలాగోలా వెళ్దామని దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసాల తిరస్కరణ డాటాను పరిశీలిస్తే.. ప్రాంతాల వారీగా వాటిలో అసమానతలు పెరుగుతున్నాయన్న విషయం వెల్లడవుతున్నది. దీనివల్ల అమెరికాలో విద్యావకాశాలు యోగ్యత, ప్రతిభ కంటే భౌగోళిక పరిస్థితుల వల్లే ఎక్కువగా ప్రభావితమవుతున్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అమెరికా విద్యావకాశాల విషయంలో ప్రాంతీయఅంతరం పెరుగుతున్నదని ఒక నివేదిక వెల్లడించింది. భారత దేశం సహా పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, కెన్యా, బ్రెజిల్, మెక్సికో, వియత్నాం, అర్జెంటీనా లాంటి గ్లోబల్ సౌత్ దేశాల నుంచి వచ్చే విద్యార్థి వీసా దరఖాస్తుదారులు, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే వారితో పోలిస్తే అధిక తిరస్కరణను ఎదుర్కొంటున్నారు. భారత స్టూడెంట్ల వీసా తిరస్కరణ ఇలా2023-36%, 2024-53%, 2025-61% 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో 3,78,787 మంది మన విద్యార్థులు ఉండగా, 2026 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 3,52,644కు తగ్గిపోయింది.

# గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆచరణీయం

### ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి
### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 2, (విజన్ ఆంధ్ర) :జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆచరణీయమైనవని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, సత్యం, అహింస, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాల ఆధారంగా స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఎటువంటి హింసకు తావులేకుండా నైతిక విలువలు, శాంతియుత పోరాటం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చని గాంధీజీ ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. గాంధీజీ జీవితమే ఒక సందేశమని కలెక్టర్ అన్నారు. సత్యనిష్ఠ, అహింస, నిరాడంబర జీవనం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం వంటి విలువలను ఆయన తన జీవితంలో ఆచరించి చూపారని తెలిపారు. ఈ విలువలు కేవలం స్వాతంత్ర్య ఉద్యమ కాలానికే పరిమితం కాకుండా, నేటి సమాజంలోనూ ప్రతి ఒక్కరి వ్యక్తిగత మరియు సామాజిక జీవితంలో మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని, నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. పరస్పర సహకారం, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవడం ద్వారా బలమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు చురుకుగా భాగస్వామ్యం కావాలని అన్నారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మహాత్మా గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ నిజాయితీ, కర్తవ్యనిబద్ధత, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించేందుకు విద్యార్థులు, యువత ప్రత్యేకంగా ముందుకు రావాలని అన్నారు. దేశ అభివృద్ధి, సమాజ సంక్షేమం కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే గాంధీజీ కలలు కన్న సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి, ఆశ వర్కర్లకు సన్మానము
## అంగన్‌వాడీ టీచర్ల, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం. జన్నె మొగిలి



భూపాలపల్లిజిల్లా 02 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి మండలం గొర్లవేడు గ్రామం లో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లను సత్కారం చేసిన బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా బీజేపీ జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్ మిలన్ సేవా కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నె మొగిలి మహిళా మోర్చా అధ్యక్షురాలు బూర పద్మ హాజరైనారు. ఈ సందర్భంగా గొర్లవేడు అంగన్వాడీ కేంద్రం టీచర్లు, ఆయా ఆశ వర్కర్ల సేవలను అభినందిస్తూ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జన్నె మొగిలి మాట్లాడుతూ.. నిరంతరం చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్య కోసం పాటుపడుతున్న అంగన్వాడీ సిబ్బందికి ప్రధాని మోదీ పంపిన ప్రత్యేక అభినందనలు తెలిపి వారిని గౌరవించారు. అలాగే గర్భిణులు, బాలింతలు మరియు పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సరైన పోషకాహారం యొక్క ఆవశ్యకతపై స్థానికులకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆర్థిక నిధులు, పోషకాహార సహాయం, మరియు మౌలిక వసతుల పెంపుదలకు అవసరమైన పరికరాలను అందిస్తుంది. ఇది ఒక కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకం అని,. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా జన్నె మొగిలి తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, నరాల కొమురయ్య, మందల జైపాల్, సాదు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

### మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి
### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర) : మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ సమావేశము హాలు నందు శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిబద్ధతతో సేవలందిస్తూ గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, మెప్మా రవికుమార్, గ్రౌద్ వాటర్ రవి, సెక్షన్ సుపరిండెంట్ భరత్, రమేష్, సి సి లు నరేందర్, రామకృష్ణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొలిముద్దు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### జడ్పీ సీఈఓ సుధీర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ రెండు ( విజన్ ఆంధ్ర ) : తొలిముద్దు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జెడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తొలి ముద్ద" అనే కార్యక్రమం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామయ్య గూడ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు చేపట్టిన కార్యక్రమమును జడ్పీ సీఈఓ సుధీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు . దీని ప్రధాన లక్ష్యం చిన్నారుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అవసరమైన పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, 19 వ వార్డు కౌన్సిలర్ రాయికల్ జగదీశ్వరి మల్లేశం ముదిరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీ. కె. కాంతారావు,
స్థానిక సీడీపీఓ శ్రీలత,స్థానిక సూపర్ వైసర్ షాలిని తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యాన్ని కాపాడుదాం రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

### సిపిఐ కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 ( విజన్ ఆంధ్ర ) : దేశంలో వికసిత భారత్ పేరుతో కేంద్ర పాలకవర్గాలు విభజిస్తూ విద్వేషాలను రగిలిస్తున్న కేంద్ర ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ మతసామరస్యాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు శుక్రవారం హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డితో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మతసామరస్యత కాపాడాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం నేదునూరి జ్యోతి,మోతే లింగారెడ్డి మాట్లాడుతూ మతం ఆధారంగా సమాజంలో విభజన తీసుకువచ్చి లౌకివాదాన్ని, భారత రాజ్యాంగాన్ని,ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ఫాసిస్టు పాలకులు అపహస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. భారతదేశం అన్ని మతాల విభిన్న భాషల ప్రాంతాల సామరస్యంతో సహజీవనం చేసే లౌకికవాద సమాజం అనే మౌలిక పునాదిని ఆర్ఎస్ఎస్,బిజెపి దెబ్బతీస్తుందన్నారు. నేడు దేశం మితవాదం, మతతత్వ ఫాసిజం అశ్రిత పెట్టుబడిదారీ విధానం అనుసరించే రాజకీయ శక్తులు రాజ్యాంగ మూల విలువలైన లౌకికవాదం, సంక్షేమవాదం,నమాఖ్య వాదాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. స్వేచ్ఛ సమానత్వం సామాజిక న్యాయం గౌరవాన్ని హామీ ఇచ్చే వ్యవస్థ నిర్మాణం కొరకు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి,మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, మాదాసి బాబు,ముజ్జిగ పరుశరాములు, షేక్ బాబు, నాంపల్లి లక్ష్మయ్య, గోపరాజు కుమారస్వామి,ముజ్జిగ అజయ్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, దుస్స వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీఆశయాలు కొనసాగిద్దాం

### పి ఆర్ యి యు జిల్లా అధ్యక్షులు యాద్గిర్ జనార్దన్ రెడ్డి



నారాయణపేట, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) మహాత్మా గాంధీజయంతిని పురస్కరించుకొని నారాయ ణపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పి ఆర్ టి యు టి ఎస్ నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భం గా జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షిస్తూనే ఉపాధ్యాయ సమస్యల సాధనకు సంఘం కృషి చేస్తుందని అన్నారు. రాబోయే కాలం లో గాంధీ చూపిన మార్గం లో ఉద్యమించి కాంట్రిబ్యూ టర్ పెన్షన్స్ స్కీం విధానా న్ని రద్దు పరచడానికి, అదేవిధంగా ఆర్థిక ప్రయోజ నాలైనా పిఆర్సి సాధనకు కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఏం రఘువీర్ నారాయణపేట దామరగిద్ద ఉట్కూర్ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జనార్దన్ జహీరుద్దీన్ సత్యనారాయ ణ రెడ్డి రమేష్ నరసింహా రెడ్డి రాష్ట్ర జిల్లా బాధ్యులు శంభు లింగం ప్రకాష్ నరేష్ కుమార్ ఫజల్ విజయ్ కుమార్ బాలాజీ అరవింద్ గోపాలకృష్ణ సాయప్ప ఆంజనేయులు అశోక్ శ్రీనివాస్ అమృతు తిప్పన్న సుదర్శన్ హిమనుష శశిధర్ భాస్కర్ సాదిక్ అధిక సంఖ్య లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా కనిష్క డిగ్రీ , పీజీ కాలేజ్ ప్రెషర్ పార్టీ వేడుకలు

### ఆట పాటలతో అలరించిన కాలేజీ విద్యార్థులు
### ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించిన కాలేజ్ సెక్రటరీ గోలి వెంకట్

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర):హనుమకొండ భీమవరంలో గల కనిష్క డిగ్రీ ఉ కాలేజీ ఫ్రెషర్స్ వేడుకలు ఎం.టీ.ఆర్ గార్డెన్ లో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కనిష్క కాలేజీ సెక్రటరీ గోలి వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోలి వెంకట్ మాట్లాడుతూ గత సంవత్సరం కే.యూ రిజల్స్ లో 9.6జి.పి.ఏ సాధించిన 3 విద్యార్థులను అదేవిధంగా 9 జి.పి.ఏ లను సాధించిన 7 విద్యార్థులను సన్మానించడం జరిగింది. అదేవిధంగా గత సంవత్సరం 86 మంది కాలేజ్ ప్లేసెమెంట్ సాధించిన వారిని కూడా అభినందించడం జరిగిందని ఆయన అన్నారు. మా కళాశాల లో కార్పొరేట్ రిక్రూమెంట్స్ ట్రేనింగ్స్, టాస్క్ ఏం.ఎన్.సి కంపెనీ లో ఉద్యోగాల కోసం ట్రైనింగ్ ఇవ్వబడును. కావున విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేడుకల్లో కాలేజీ విద్యార్థులు ఆటపాటలతో కార్యక్రమాన్ని హోరెత్తించారుఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ గోవర్ధన్, మంజుల గార్లు,ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ముడుమాల్ వారసత్వ స్థల అభివృద్ధికి సహకారం

హైదరాబాద్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): నారాయణపేట జిల్లాలోని జాతీయ ప్రాధాన్యమున్న ముడుమాల్ బృహత్‌శిలాయుగ స్థల సమగ్ర అభివృద్ధి, పరిరక్షణకు అవసరమైన సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఐఏఎస్ హామీ ఇచ్చారని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకులు ప్రొ.అర్జున్ రావు తోకలసి కలెక్టర్‌ను కలిసి స్థల సరిహద్దుల గుర్తింపు, భూసేకరణ, బీటీ అప్రోచ్ రోడ్డు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు,
టూరిజం గైడ్‌లకు శిక్షణ, ఏటా రెండు సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణపై చర్చించినట్లు తెలిపారు. ముడుమాల్‌ను ప్రముఖ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## వృద్ధురాలి అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి



ముత్తారం, అక్టోబరు 1(విజన్ ఆంధ్ర)ముత్తారం గ్రామానికి చెందిన సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సెప్టెంబరు 30న ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ముత్తారం పోలీసులను ఆశ్రయించారు.అదృశ్యమైన వృద్ధురాలి వయస్సు సుమారు 70 సంవత్సరాలు, ఎత్తు 5 అడుగుల 3 అంగుళాలు, తెలుపు శరీర ఛాయ కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో నీలం రంగు చీర ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు వెంటనే ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ ఐ రవికుమార్ తెలిపారు.

## 3.38 కోట్ల మందిపై ఇండస్ టవర్స్ సీఎస్ఆర్ ప్రభావం

హైదరాబాద్, అక్టోబర్ 01 (విజన్ ఆంధ్ర) : ఇండస్ టవర్స్ లిమిటెడ్ చేపట్టిన 'సక్షమ్', 'ప్రగతి' సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా ఆర్థిక సంవత్సరం–26లో దేశ వ్యాప్తంగా 3.388 కోట్ల మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపినట్లు ఇండస్ టవర్స్ ఎండీ, సీఈఓ ప్రచూర్ సాహ్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తంగా ఇప్పటివరకు 9 కోట్ల మందికి సీఎస్ఆర్ కార్యక్రమాలను విస్తరించినట్లు పేర్కొన్నారు. డిజిటల్ సమ్మిళితం, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మహిళా సాధికారత తదితర రంగాల్లో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి 15 కోట్ల మంది జీవితాలపై ప్రభావం చూపడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సాధికారతకు తమ సీఎస్ఆర్ కార్యక్రమాలు దోహద పడుతున్నాయని తెలిపారు.

## నీటి వృథాను అరికట్టి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్



ఆదిలాబాద్ (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పురపాలక శాఖ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులతో నీటి వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ మాట్లాడుతూ, మినరల్ వాటర్ ప్లాంట్లలో నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ప్లాంట్ యజమాని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థ నీటిని వృథాగా వదలకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వాటిలోకి మళ్లించాలని తెలిపారు.రానున్న ఎండాకాలంలో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని ఆమె కోరారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి జిల్లా అక్టోబర్ (విజన్ ఆంధ్ర) మహాత్మా గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, సహనం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే జాతిపితకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ అనుసరించిన అహింసా మార్గం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజంలో శాంతి, సమానత్వం, సోదరభావం పెంపొందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది గాంధీజీ సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకొని అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. భావితరాలకు గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో వసంతకుమారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీకాంత్, పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ వెంకన్న, ఏఈఏస్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా బస్టాండ్‌లో శుభ్రతా కార్యక్రమం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పిలుపు



కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా బస్టాండ్‌లోని మరుగుదొడ్లను శుభ్రం చేశారు. బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు మొక్కలు నాటారుఅనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా కోట్లాది కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి, ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవానికి పెద్దపీట వేశారని తెలిపారు. గాంధీజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించాలని అన్నారు.ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. తద్వారా డెంగ్యూ, ఇతర వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తమను తాము కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా పట్టణాలు, గ్రామాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచడం సాధ్యం కాదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం బస్టాండ్ ఆవరణలోని ప్రయాణికులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, కౌన్సిలర్ చిప్పకుర్తి శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్ రావు, నాయకులు గొల్లపల్లి వీరభద్రచారి, కొప్పుల శంకర్, హనుమంతరావు, అరుణ్ లోయా, లోనరే రవీందర్, అగ్గిళ్ల శ్రీనివాస్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాటసింగారం సహకార సంఘం 5రివ సర్వసభ సమావేశం

### –రైతు సంక్షేమమే సహకార సంఘం ప్రధాన ధ్యేయం: చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మెట్ (విజన్ ఆంధ్ర): రైతుల సంక్షేమం ఆర్థిక శ్రేయస్సే బాటసింగారం సహకార సంఘం ప్రాథమిక లక్ష్యమని సంఘ చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో బుధవారం బాటసింగారం సహకార సంఘం 59వ సర్వసభసమావేశం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగు ణంగా సహకార సేవలు అందించేందుకు సంఘం నిరంతరం కృషిచేస్తోందన్నారు. సంఘాన్ని ఆర్థికంగా, పరిపాలనాపరంగా బలోపేతం చేసినప్పుడే రైతులకు మరింత మెరుగ్గా రుణాలు, ఇతర సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సంఘంలో డైరెక్టర్ నియామకంపై వచ్చిన అంశాలపై స్పందిస్తూ.. సహకార చట్టాలు, సొసైటీ నిర్దేశిత విధివిధానాలకు అనుగుణంగా నే నియామకం ప్రక్రియ పూర్తయిందని చైర్మన్ స్పష్టత ఇచ్చారు. సంఘ కార్యకలాపాలన్నీ పూర్తిపారదర్శకంగా, నిబంధనలకు లోబడే సాగుతు న్నాయని పేర్కొన్నారు. సంఘానికి రావాల్సిన పెండింగ్ రుణ బకాయిల వసూలుపై సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం ఆర్థిక పురోగతికి సహకరించాలని కోరారు. బకాయిలు సకాలంలో వసూలైతే భవిష్యత్తులో మరింతమంది రైతులకు రుణ సదుపాయం కల్పించే వీలుంటుందని వివరించారు. ఈ సర్వసభ సమావేశంలో సంఘం వార్షిక ఆదాయవ్యయాలు, ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్ ప్రణాళికలపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. పాలకవర్గం, సిబ్బంది, సభ్యుల సమన్వయంతో బాటసింగారం సహకార సంఘాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామ నిధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ గంట శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలంగౌడ్, బలిజగూడ సర్పంచ్ ఉప్పు మాధవినవీన్, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమాగౌని భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకులు ఉప్పు వెంకటేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, సంఘసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్య సేవల పురోగతిపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలి:జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులతో పాటు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబీఎన్ఐసీయూ, గైనకాలజీ వార్డులను కలెక్టర్ పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రసవానంతరం బాలింతలు, నవజాత శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించే ప్రక్రియపై వైద్యులతో చర్చించారు. వైద్యులు, సిబ్బంది ప్రస్తావించిన చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఒకటి రెండు రోజుల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.13 కోట్ల నిధులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం మున్సిపల్, పంచాయతీరాజ్, టీజీఎంఎస్ఐడీసీ, ఆర్అండ్‌బీ తదితర ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోగుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాలను దృష్టిలో ఉంచుకుని టాయిలెట్ల మరమ్మతులు, పెయింటింగ్, ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటు, ఇతర మరమ్మతు పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఒకేసారి వివిధ పనులు కొనసాగుతున్నప్పుడు రోగులు, వారి సహాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో పనులు నిర్వహించాలని ఆదేశించారు.రిమ్స్ ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద తాగునీటి సౌకర్యం, స్కానింగ్ పరికరాలు, చెత్తబుట్టలు, షూ ర్యాక్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణ సంస్థలు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు ఆసుపత్రి నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. రిమ్స్‌లో రోగుల రద్దీ అధికంగా ఉ ఒడే గైనకాలజీ, పీడియాట్రిక్ వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఇటీవల కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపికైన వైద్యుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, అవసరమైన వార్డుల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రిమ్స్‌లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు నిరంతర తనిఖీలు, సమీక్షలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పారిశుధ్యం, వైద్య సిబ్బంది అందుబాటు, రోగులకు అవసరమైన సౌకర్యాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, రిమ్స్, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం

### – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో , అక్టోబర్: 2(విజన్ ఆంధ్ర)మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ఏ ఓ, సిబ్బంది ,తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళు లర్పించారు.

## గాంధీ,శాస్త్రి ఆశయాలు ఆదర్శనీయం

### కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నరేష్‌కుమార్ నర్సింగోజు

### ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో మహాత్మా గాంధీ,మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



బోడుప్పల్,అక్టోబర్ 02(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను మేడిపల్లిలోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు గాంధీ,లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ మేరకుకేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నరేష్‌కుమార్ నర్సింగోజు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ అహింసా మార్గంలో సాగించిన పోరాటం దేశ ప్రజలకు ఆదర్శమన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్––జై కిసాన్ నినాదంతో సైనికులు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఇద్దరు మహనీయుల ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉ ందన్నారు.ఈకార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణ, రంగు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌గౌడ్, వెంకటసుబ్బయ్య, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్–జీ కింద గ్రామసభల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1(విజన్ ఆంధ్ర)వీబీజీ రామ్–జీ (VBG RAM-G) కింద శుక్రవారం నుంచి నిర్వహించనున్న గ్రామసభల ఏర్పాట్లు, పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం కలెక్టర్ కార్యాలయం తన ఛాంబర్ నుండి సంబంధిత అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారులు, ఎం.పి.డి.ఓ లు, ఎం.పి ఓ లు, ఎ.పి.ఓ లతో నిర్వహించిన ఈ సమావేశంలో సమావేశంలో గ్రామసభల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల సమన్వయం, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై సమీక్షించారు.గ్రామసభలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామసభల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామసభల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను మండల స్థాయిలో పర్యవేక్షిస్తూ, నిర్దేశిత కార్యక్రమం ప్రకారం సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు.సమావేశంలో డి.ఆర్.డి.ఓ నర్సింహులు, గృహ నిర్మాణ శాఖ పి.డి ఉపేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి శివారులోని ఇర్ఫాని దర్గా 24 వ ఉర్సు ఉత్సవాలు



సంగారెడ్డిబ్యూరో, అక్టోబర్: 1(విజన్ ఆంధ్ర)ర్ఫాని దర్గా 24 వ ఉర్సు ఉత్సవాలు 2 వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఇర్ఫాని దర్గా పీఠాధి ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనంలో ప్రపంచ ప్రఖ్యాత కవులు పాల్గొన్నారు అని . 2 వ తేదీన దీపారాధన, ఖవ్వాలి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులు వివిధ ప్రాంతాలు ఇతర జిల్లాల రాష్ట్రల నుండి పాల్గొంటారని తెలిపారు

## స్వచ్ఛత అనేది ప్రతి పౌరుడు సామాజిక బాధ్యత

### స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం స్వచ్ఛతా హి సేవా --2026 కార్యక్రమంలో ఎల్‌డీఎం నాగరాజు



భూపాలపల్లి జిల్లా 1అక్టోబర్ (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి: స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) బి. నాగరాజు అన్నారు.స్వచ్ఛతా హి సేవా--2026లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు, ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ (సీఎఫ్ఎల్) సభ్యుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమాలతో పాటు పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భూపాలపల్లి శాఖ మేనేజర్ బి. ప్రవీణ్, మంజూర్‌నగర్ శాఖ మేనేజర్ రాజాబాబు, ఎల్‌డీఎం బి. నాగరాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సీఎఫ్ఎల్ సభ్యులు డి. శ్రీనివాస్, సురేష్, ఎన్. రాహుల్ తదితరులు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఎల్‌డీఎం నాగరాజు పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.బ్యాంకింగ్ సంస్థలు, సీఎఫ్ఎల్ వంటి సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చని తెలిపారు.

## శ్రీ వాసవి వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి



బోడుప్పల్,అక్టోబర్02(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బోడుప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీ వాసవి వైశ్య సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, అహింసా సిద్ధాంతాన్ని, స్వాతంత్ర్య సాధనలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో శ్రీ వాసవి వైశ్య సంఘం వ్యవస్థాప అధ్యక్షులు ప్రొద్దుటూరి నర్సింగరావు,ప్రధాన కార్యదర్శి పాలడి ప్రవీణ్ కుమార్,కోశాధికారికెవి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు బాదాం రవి,రెడ్డిశెట్టి రామకృష్ణ,ప్రొద్దుటూరి సంతోష్,ప్రొదుటూరి లక్ష్మణ్,కుబేరుడు,కాశెట్టి రాజు,నంబూరి కిషన్,హోటల్ శ్రీనివాస్,మరిశెట్టి శ్రీశైలం,కెవి రమణ.కోటగిరి మహేష్,జర్నలిస్టు బండారు శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలి

### – జిల్లా అధ్యక్షులు రజనీకాంత్






కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ ఆవరణలో గాంధీ విగ్రహానికి అధ్యక్షులు రజనీకాంత్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకై దశాబ్దాలుగా పోరాటం సాగుతోందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఐజేయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. రజనీకాంత్, టి.రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. టియుడబ్ల్యూజే(ఐజేయు) పిలుపు మేరకు 'దేశవ్యాప్త డిమాండ్ల దినోత్సవం' పురస్కరించుకుని శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముదాం శంకర్ పటేల్, కోశాధికారి ముదాం వెంకటేశ్వర్లు, అబిద్, శ్రీనివాస్ రెడ్డి, కౌసర్ అలీ, రజాక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముదం శివశంకర్, చక్రధర్ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02,(విజన్ ఆంధ్ర)సమాచార హక్కు చట్టం--2005ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించి జిల్లా స్థాయిలో సమన్వయం, పర్యవేక్షణ, అమలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను నామినేషన్ రోటేషన్ పద్ధతిలో సభ్యులుగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత కలిగిన ఆర్‌టిఐ కార్యకర్తలు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో సభ్యులుగా సేవలందించేందుకు తమ దరఖాస్తులను ప్రజా సమాచార అధికారి / జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంచిర్యాలలో ఈ నెల 6వ తేదీ లోగా వ్యక్తిగతంగా సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నామినేట్ చేయడం జరుగుతుందని, జిల్లాలోని ఆర్‌టిఐ కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

# రైల్వే జీఎం 4వ ఫ్లాట్ ఫారం నిర్మించండి

### రైల్వే సమస్యలపై హిందీ భాషలో ఫ్లెక్సీ ప్రదర్శన రైల్వే జీఎం కు వినతిపత్రం సమర్పించిన జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శశీతన్ రామరాజు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ రైల్వే స్టేషన్లో నాలుగవ ఫ్లాట్ ఫారం నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ పనుల పర్యవేక్షణలో భాగంగా మహబూబాబాద్ కు విచ్చేసిన సికింద్రాబాద్ రైల్వే జోన్ జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన శ్రీవాస్తవ అయన మాతృభాష హిందీలో రైల్వే సమస్యలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రజల డిమాండ్ ను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ దక్షిణమధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ లో భాగంగా మహబూబాబాద్ స్టేషన్ ఉందన్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద రైల్వే నవీకరణ జరుగుతోందాన్నారు. మూడో లైన్ ఆగమణంతో రైల్వేస్టేషన్ రూపురేఖలే మారిపోయిన దరిమిలా నాల్గో నంబర్ ఫ్లాట్ ఫారం నిర్మించాల్సి ఉందన్నన్నారు. దీని స్థానంలో గోడకట్టి అధికారులు చేతులు దులుపుకున్నారని వాపోయారు. రైలెక్కాలంటే బ్రిడ్జి మెట్లు ఎక్కి దిగాల్సిన దుస్థితి నెలకొందని అసహనం వెలిబుచ్చారు దీంతో వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, వికలాంగులు, స్థూలకాయులు, హృద్రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మొదట 150 మీటర్లతో బేబీ ఫ్లాట్ ఫారం నిర్మించాలనే ప్రతిపాదన వున్నాకూడా అధికారులు పట్టించుకోకుండా అడ్డుగోడ నిర్మించారన్నారు.నాలుగో లైను వస్తోందని అతర్వాతనే నాలుగో ఫ్లాట్ ఫారం నిర్మిస్తారని ప్రజాప్రతినిధులు చెప్తున్నారన్నారు. అయితే ఆలైను రావడానికి ఇంకో నాలుగైదేండ్లు సమయం పడుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయని అన్నారు. ఇలా అధికారులకు ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వెళ్ళగక్కారు. ప్రతిరోజూ పలురైళ్ళ రాకపోకలు, నాలుగైదు వేలమంది ప్రయాణికులతో సుమారు ఆరులక్షల రూపాయల ఆదాయం సమకూరుతోందని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులతో రైల్వేస్టేషన్ నిత్యం రద్దీగ ఉంటుందని అలాంటప్పుడు పూర్తి స్థాయిలో మౌలికవసుతుల కల్పన అత్యావశ్యకమని అన్నాడు. రైలు నిండాలన్నా, ఖాలీ కావాలన్నా ఈ స్టేషనే ప్రతిపదిక అని అన్నారు. ఇంత రద్దీ గల స్టేషన్లో పూర్తిస్తాయి ఫ్లాట్ ఫారాలు, స్టేషన్ పై కప్పులు, ఎస్కలేటర్ల నిర్మాణం లేకపోవడం దురదృష్టకరమన్నారు. అలాగే పట్టణాన్ని రెండుగా చీలుస్తున్న రైల్వే స్టేషన్ కు ఇరువైపులా పాధాచారుల వంతెన కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. పనులజాప్యం పట్ల విచారం వ్యక్తంచేశాడు. అదేవిదంగా ఆఫీసర్స్ క్లబ్ దగ్గర కూడా ఒక గేట్ ను ఏర్పాటు చేసినట్లయితే శ్రీనివాస్ టాకీస్ వైపు కొంచం రద్దీ తగ్గుతుందని సూచించారు. ముమ్మందు అదనపు రైళ్ల హాల్టింగ్ ని దృష్టిలో పెట్టుకొని రైల్వే అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చెయ్యాలన్నారు. వీరిద్దరి సమన్వయ లోపానికి నిదర్శనం రైల్వే అండర్ బ్రిడ్జి అసంపూర్ణ నిర్మాణం, రైవ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి విడుదలైన 56కోట్ల నిధుల వాపస్ తో పాటు ఇల్లందు కురవి రోడ్లను కలుపుతున్న తలాతోక లేని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలని ఎడ్డీవా చేశారు. ఈనిర్మాణాలతో ప్రజలు నిత్యం నరకం చూడడమే కాకుండా ప్రాణనష్టం జరగడం కూడా దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సత్యనారాయణ, మెగా రైవ్ మినిటనేన్స్ డిపో సాధన కమిటీ నాయకులు మైస శ్రీనివాస్, లెక్చర్ చొప్పరి శ్రీనివాస్, దొడ్డ సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతి

### –ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

### –జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి డిమాండ్





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్:02(విజన్ ఆంధ్ర) గాంధీ జయంతి సందర్భంగా జాతీయ జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో లో జరిగిన కార్యక్రమంలో యాదగిరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. మీడియా రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విధాన సిఫారసులు చేసేందుకు సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థలను దాడులు, బెదిరింపులు, అణచివేత నుంచి రక్షించేందుకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన 1955, 1958 చట్టాల నిబంధనలను పునరుద్ధరించి ఉద్యోగ భద్రత, పని గంటల పరిమితి, వివాదాల పరిష్కారం, ఉద్యోగం నుంచి తొలగించినప్పుడు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగులకు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు అందించేందుకు కొత్త వేతన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, సంగారెడ్డి జిల్లాలోనూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు స్థలం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు ఆరోగ్య సేవలను పునరుద్ధరించి, తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రిడిటేషన్ కార్డులు అందని అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు జారీ చేయాలని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వాలు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకుడు జోగిపేట యాదగిరి, వెంకటరెడ్డి, సంఘం జిల్లా కోశాధికారి అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, శ్రీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, ఉలవల రాజు, అంజయ్య,జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, సుమన్,చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు నజీర్,సీనియర్ జర్నలిస్టు మధుసూదనాచారి, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయరాజు, పరంజ్యోతి, నాగరాజుగౌడ్,ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, ఇతర నేతలు పవన్ ,సంతోష్, సత్యం, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్, పటాన్చెరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పత్తి నరసింహ ప్రధాన కార్యదర్శి యాదగిరి, బొల్లారం నాయుడు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ గంజ్‌లో గాంధీ జయంతి వేడుకలు



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 2(విజన్ఆంధ్ర)జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ గంజ్‌లో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, స్వచ్ఛత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాముసూరు విమానాశ్రమంకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

### తెలంగాణ ఇంటలేక్షవల్ ఫోరం డిమాండ్



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో హన్మకొండ ప్రెస్ క్లబ్లో జర్నలిస్ట్ దామెర రవీందర్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ మామునూరు విమానాశ్రయం కు పెట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరై మాట్లాడుతూ.... ప్రపంచంలోనే తెలంగాణ మట్టి మనుషులు చేసిన సాయుధ పోరాటం ఉద్యమాల చరిత్రలో ప్రాముఖ్యత సంతరించుకుంది 1946 జూలై 4న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో తుపాకీ గుళ్లకు ఎదురుగా నిలిచి దొడ్డి కొమరయ్య అమరత్వం పొందడం జరిగింది గుర్తుగా వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ కు దొడ్డి కొమరయ్య పేరును పెట్టడం అమరవీరులకు మనం ఇచ్చే నివాళిగా ఇంటలెక్చువల్ ఫోరం భావిస్తుంది ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసిన రాజరికపు చరిత్రలు భూస్వామ్య దోపిడీ చరిత్రలో తెలంగాణ నిర్మాణాలకు అవసరం లేదని ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన వీరుల వీరుల పేర్లను పెట్టాలని తెలియజేయడం జరిగింది తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా వెట్టి చాకిరి విముక్తి అయింది ప్రజా రాజ్యాధికారం కోసం అనేక మంది వీరులు త్యాగం చేశారు చాకలి ఐలమ్మ షేక్ బందర్ కి షేపుల ఖాన్ దొడ్డు కొమురయ్య లాంటి అనేకమంది భూములు గుంజుకున్నా భూస్వాముల పేర్లు ప్రజా కార్లు దేశముఖల పేర్లు రాజరీక చరిత్ర పేర్లు తెలంగాణ ప్రాంతంలో కొనసాగడానికి వీలులేదని ఆత్మగౌరవం కోసం ప్రాణాలు ఇచ్చిన పీర్ల చరిత్ర ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కులాలకు మతాలకు అతీతంగా దొడ్డు కొమురయ్య పేరు సముచితంగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ప్రభుత్వం దొడ్డి కొమరయ్య పేరు పెట్టని పక్షంలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయిందని ఈ సందర్భంగా హెచ్చరించడం జరిగింది ముఖ్యమంత్రి గతంలో ఒక సమావేశంలో దొడ్డి కొమురయ్య పేరును పెడతామని మాట్లాడడం జరిగింది ఇప్పుడు మాట మార్చితే తెలంగాణ బహుజన ప్రజల ఆగ్రహానికి గురిగావాల్సి వస్తుంది. కాబట్టి సాయుధ పోరాట అమరుల పేర్లు పెట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని తెలియడం జరిగింది ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అజాద్ కడమంచి రాంబాబు ఐలయ్య మహేష్ పాణి శ్రావణ్ శివ తిరుపతి లింగయ్య శ్రీనివాస్ చార్వాక కోడల ప్రసాద్ రమేష్ ప్రభాకర్ విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి

### మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు



బోడుప్పల్,అక్టోబర్ 02(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బోడుప్పల్ నగర బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటం, త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక ఐక్యత, శాంతి, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల డిమాండ్ల దినంగా గాంధీ జయంతి

### ఎమ్మెల్యే జి ఎస్ ఆర్ కు వినతి పత్రం



భూపాలపల్లి జిల్లా 02 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) కార్యవర్గ సమావేశం నిర్ణయం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ జయంతిని జర్నలిస్టుల డిమాండ్ల దినంగా శుక్రవారం పాటించారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో గాంధీ విగ్రహానికి యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపి, రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సమంతుల శ్యామ్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు అందజేసి రాష్ట్రపతికి పంపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. జర్నలిస్టులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించి నగదు రహిత వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిట్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఐలయ్య, పుల్ల రవీందర్, సుబ్రహ్మణ్యస్వామి, సుధాకర్, రవి, కాట్రేవుల ఐలయ్య, శీలపాక ప్రణీత్‌కుమార్, నేరెళ్ల ఓదెలు, గుర్రం తిరుపతి, కట్కూరి రాజు, జీడి సురేష్, విజయ్, మాసు కుమార్, మైదం మహేష్, మ్యాదరి సునీల్, గొర్రె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీలమానసిక పరివర్తనే కొత్త జీవితానికి నాంది

### డాక్టర్ బోనగిరి అనిల్ గుప్తా దంత వైద్య నిపుణులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర):మానసిక పరివర్తనే కొత్త జీవితానికి నాంది అని ప్రముఖ దంతవైద్య నిపుణులు లిడాక్టర్‌లి లిబోనగిరి అనిల్ గుప్తాలి అన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నాడు స్థానిక సబ్ జైలులో ఏర్పాటు చేసిన 'ఖైదీల సంక్షేమ దినోత్సవం"లో అయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

జైలు పర్యవేక్షణాధికారి మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొదట మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ బోనగిరి అనిల్ గుప్తా మాట్లాడుతూ మహాత్మాగాంధీ అంటేనే అహింస, పరమతసహణం, పరోపకార గుణం, సాటి మనిషిని గౌరవించడం వంటివని అందుకే ఈరోజును ఖైదీల సంక్షేమ దినోత్సవంగా కూడా జరువుకుంటున్నారని అన్నాడు. జైళ్లు అంటే శిక్ష కాదని జైళ్లు అంటే పరివర్తనా నిలయాలు అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ జీవితం సమాజానికి కరదీపిక అని కొనియాడారు. నేర అవినీతి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయలన్నారు. జైలులోని ఖైదీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల్లో మానసిక పరివర్తన కోసం, శరీర దారుఢ్యం కోసం యోగా, పుస్తక పఠనం, ఆటలు నిర్వహిస్తున్న జైలు సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. మిఠాయిలు పంచారు.కార్యక్రమ అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ బోనగిరి అనిల్ గుప్తాకు జైలు అధికారులు సిబ్బంది ఆత్మీయ సన్మానం నిర్వహించారు.ఇంకా ఈకార్యక్రమంలోసిటిజన్ ఫోరమ్ రాష్ట్ర కోఆర్డినేటర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు, హేమ గుప్తా, జైలు సిబ్బంది మహమ్మద్ ఖలీల్ ఉద్దీన్ మోటపోతుల వీరన్న పోషిని జనార్దన్ చీర వెంకన్న దుగ్గిదేవర రామాంజనేయులు, ఎర్రబోయిన వంశీకృష్ణ , రజిత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలి

## గాంధీ జయంతి సందర్భంగా జనకాపూర్ జైలును సందర్శించిన జిల్లా కలెక్టర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02(విజన్ ఆంధ్ర) .గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (సెక్రెటరీ) అనూష అదనపు ఎస్పీ చిత్తరంజన్ జైలర్ ప్రవీణ్ తో కలిసి జిల్లా కేంద్రంలోని జన్కపూర్ జైలును సందర్శించిన కలెక్టర్ కె హరిత . ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ?సద్ప్రవర్తన జరిగిపోయిన తప్పుల గురించి ఆలోచించకుండా, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని ఖైదీలతో అన్నారు . జైలులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని, సద్ప్రవర్తనతో మెలగడం వల్ల సమాజంలో కుటుంబంలో మళ్లీ గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించవచ్చని అన్నారు ?జైలులో అందిస్తున్న వివిధ రకాల ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ఖైదీలు ఉపయోగించుకోవాలని, బయటకు వెళ్లిన తర్వాత అవి ఉపయోగపడతాయని తెలిపారు ? పూర్వకాలంలా కాకుండా ప్రస్తుత జైళ్లలో ఖైదీలకు అవసరమైన ప్రాథమిక వసతులు, గాలి,నీరు వెలుతురు, పౌష్టిక ఆహారం ఆరోగ్య సంరక్షణ మరియు మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తున్నామని అన్నారు ?విద్యార్హతలు పెంపొందించుకునే చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఖైదీల కోసం ఓపెన్ స్కూలింగ్ మరియు దూరవిద్య ఓపెన్ యూనివర్సిటీ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు పూర్తి చేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు ?ఖైదీలు ఈ వాతావరణాన్ని సానుకూలంగా మార్చుకొని సన్మార్గంలో పయనించాలని అన్నారు కలెక్టర్ ఖైదీలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ఖైదీలు తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ కె హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02,:(విజన్ ఆంధ్ర) కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్, కాగజ్నగర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం డేవిడ్, గ్రంథాలయ చైర్మన్ అనిల్ ,మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మంగ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. యావత్తు దేశాన్ని స్వాతంత్ర్య సంగ్రామంలో సంఘటితం చేసి ముందుండి శాంతి, అహింస మార్గాలలో నడిపించారని అన్నారు. గాంధీజీ జీవితాన్ని అందరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. తన జీవితాన్ని మొత్తం భారతదేశ స్వాతంత్ర్యం కొరకు అర్పించారని కలెక్టర్ గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. ప్రతి ఒక్కరు గాంధీజీ చూపిన మార్గంలో పయనించాలని చెప్పారు. సమాజంలోని రుగ్మతల నిర్మూలనలో, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని కలెక్టర్ తెలిపారు.
ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ, గాంధీజీ గొప్పతనాన్ని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కిరణ్ ,జడ్పిసిఓ లక్ష్మీనారాయణ వెనుకబడిన అభివృద్ధి శాఖ అధికారి నదిముద్దీన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ జీ జయంతి వేడుకలు

### మహాత్మా గాంధీజీ ఆశయాలు కొనసాగించాలి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర బ్యూరో) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేట నందు జాతిపిత మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూప్రపంచం శాంతి కి మార్గదర్శి అని గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశం అంతటిని ఒకే తాటిపైకి తెచ్చి స్వాతంత్రాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర వహించి తన చివరి శ్వాస వరకు శాంతి అహింసా మార్గాలను ప్రచారం చేశారు. బడుగు బలహీన అభ్యున్నతి కృషిచేసిన వ్యక్తి అని , గ్రామ పంచాయతీలు బాగు పడినప్పుడు గ్రామ పంచాయతీలు బాగుపడే రోజు దేశం బాగుపడుతుందని గ్రామాలు అభివృద్ధి చెందాలని, స్వచ్ఛభారత్ ఆకాంక్షించారు తెలిపారు. నేటి యువత గాంధీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలను విస్మరించిన భీం ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలి సూపరింటెండెంట్ బాధ్యత వహించాలి

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2:(విజన్ ఆంధ్ర)మెడికల్ కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(గూ×ఖజ) ఆధ్వర్యంలో కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పే స్లిప్, యూనిఫామ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారంఉదయం షిఫ్ట్ నుంచి విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్(గూ×ఖజ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ.. కార్మికులతో నిరంతరం విధులు నిర్వహించించుకుంటూ వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో భీం ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు.
కార్మికుల ప్రధాన డిమాండ్లు..
1. పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి.
2. కార్మికుల పీఎఫ్ (గ్రాఖీ) మొత్తాలను ప్రతి నెలా సక్రమంగా జమ



చేయాలి.
3. ఈఎస్ఐ (జుూ×) సౌకర్యాన్ని అర్హత కలిగిన ప్రతి కార్మికుడికి సక్రమంగా అమలు చేయాలి.
4. ప్రతి నెలా కార్మికులకు పే స్లిప్‌లు తప్పనిసరిగా అందజేయాలి.
5. విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికీ నాణ్యమైన యూనిఫామ్‌లు అందించాలి.
6. కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన అన్ని హక్కులు, సౌకర్యాలను అమలు చేయాలి.
7. కార్మికుల సమస్యలను విస్మరిస్తున్న ప్రస్తుత ఏజెన్సీపై తగిన చర్యలు తీసుకోవాలి.
8. ప్రస్తుత ఏజెన్సీని తొలగించి, కార్మికుల సమస్యలను సక్రమంగా పరిష్కరించే కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలి.
9. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఆసుపత్రి/సంస్థ సూపరింటెండెంట్ బాధ్యత వహించి, తక్షణ చర్యలు తీసుకోవాలి.
10. యూనియన్ ప్రతినిధులతో చర్చించి కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.
కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, పే స్లిప్, యూనిఫామ్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకుని, కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే యూనియన్ ఆధ్వర్యంలో తదుపరి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్, భోగే ఉపేందర్, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిజిహెచ్ ఆసిఫాబాద్ బ్రాంచి గౌరవ అధ్యక్షులు నీల,అధ్యక్షులు మమత,వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, సితార్ బేగ్,ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్,ఉపాధ్యక్షులు రాధా,తిరుపతి,నరేందర్ సహాయ కార్యదర్శిలు సువర్ణ,అమృత,వాణి ప్రమీల కోశాధికారి మాధవి తో పాటు తదితరులు పాల్గొన్నారు .

## హర్ ఘర్ జల్ జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం జిల్లా కలెక్టర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02:(విజన్ ఆంధ్ర) గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామపంచాయతీలోని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వంద శాతం మంచినీటి కనెక్షన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. హర్ ఘర్ జల్ -- జల్ జీవన్ మిషన్ లక్ష్యంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని ఇంటి వద్దకే అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ అన్నారు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీటి సరఫరా కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోందన్నారు. గోవింద్‌పూర్ గ్రామంలో వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం గ్రామస్థుల సహకారం, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సాధ్యమైందని అని అన్నారు, ప్రతి ఇంటికి అందుబాటులోకి వచ్చిన మంచినీటి కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని తెలిపారు,నీటి పైపులైన్లు, నల్లాలు తదితర వాటిలో చిన్నచిన్న మరమ్మతులు ఏర్పడినప్పుడు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. గ్రామంలో నీటి వనరులను సంరక్షించడంతో పాటు ప్రజా వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచడం, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలపై ప్రజలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత, సామాజిక బాధ్యత విషయంలో గాంధీజీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ అన్నారు . నీటి సంరక్షణ, పరిశుభ్రతపై చిన్నారులు తమ కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. హర్ ఘర్ జల్ -- జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్య సాధనలో గోవింద్‌పూర్ గ్రామం వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు . గ్రామంలో ఏవైనా మంచినీటి సరఫరా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అని అన్నారు
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సెక్రెటరీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆచరణీయం

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02,(విజన్ ఆంధ్ర)జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆచరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని, సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి ఆచరణీయ సిద్ధాంతాలను అనుసరించి స్వతంత్రాన్ని సాధించారని తెలిపారు. మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, నిరాడంబర జీవనం, దేశ సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించడంతో పాటు ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకత వంటి విలువలను పాటించాలని, గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమానత్వం కలిగిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల నిర్వహణ

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02,(విజన్ ఆంధ్ర)గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించి చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు.. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో స్వచ్ఛత హి సేవ లో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామ సభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామసభలలో గ్రామాభివృద్ధి, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వీబీ-జీ రామ్ జీ పథకానికి సంబంధించిన నూతన మార్గదర్శకాలు, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రతి జాబ్‌కార్డు కలిగిన కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. గతంలో ఉపాధి హామీ పథకంగా అమలైన కార్యక్రమం ప్రస్తుతం వీబీ-జీ రామ్‌జీ పథకం కింద అమలవుతోందని తెలిపారు. గ్రామసభలో స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి పనుల నిర్వహణకు అవసరమైన తీర్మానం చేయాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని వాటర్ హార్వెస్టింగ్, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ ఛానల్ల శుభ్రత, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులకు ప్రాధాన్యత



ఇవ్వాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ భవనం వద్ద వర్షపు నీటిని సంరక్షించే నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, ఇంటి నుంచి వెలువడే వాడుక నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల పారిశుద్ధ్యంతో పాటు భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతుందని వివరించారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఆదాయం లభించడంతో పాటు గ్రామ పంచాయతీలకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సమకూరుతాయని, నిధులను గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ఉపాధి, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, జీవనోపాధి మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామసభల ద్వారా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గాంధీశాస్త్రి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### సత్యం, అహింస మార్గంలో గాంధీజీ.. జై జవాన్ జై కిసాన్‌తో శాస్త్రి మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు




గద్వాల అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,సత్యం, అహింసను నమ్మి వాటినే ఆయుధాలుగా చేసుకుని భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ కలలుగన్న మాదకద్రవ్యాలు, మద్యపానం లేని సమాజం, మహిళలకు భద్రతతో కూడిన స్వేచ్ఛ, గ్రామీణాభివృద్ధి సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు. అదేవిధంగా లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్--జై కిసాన్" నినాదంతో దేశ రక్షణకు సైనికులు, దేశ ఆహార భద్రతకు రైతులు అందిస్తున్న సేవలను దేశానికి చాటిచెప్పారని అన్నారు. నిజాయితీ, నిరాడంబరత, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన శాస్త్రి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మహనీయుల జీవితాలు, ఆశయాలను స్మరించుకోవడంతో పాటు వాటిని నిత్య జీవితంలో ఆచరించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్ రావు, ఏఆర్ ఎస్సై రామకృష్ణ, కమ్యూనికేషన్ ఎస్సై శేఖర్, సీసీఎస్ ఎస్సై, సాయుధ దళ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### ఐ జే యు పిలుపు మేరకు జనగామలో టియుడబ్లుజె ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి

జనగామ, అక్టోబర్ 2(విజన్ ఆంధ్ర): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కులు, భద్రత, సామాజిక, ఆర్థిక సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపు మేరకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జనగామ గాంధీ చౌరస్తా నుంచి జర్నలిస్టులు ర్యాలీగా బయలుదేరి మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ గాంధీ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తిపరమైన భద్రత, ఉద్యోగ భద్రత, సామాజిక మరియు ఆర్థిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టుల ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాల్లో పనిచేస్తున్న



జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షులు ఇర్రి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురిగల బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పార్నంది వెంకటస్వామి, జిల్లా కోశాధికారి ఓరుగంటి సంతోష్ , శ్రీబాష్యం శేషాద్రి, కొత్తపల్లి కిరణ్, కన్న పర్శరాములు, కెమిడి ఉపేందర్, గణేష్, జంపాల శ్రీనివాస్, శశిధర్, రాణాప్రతాప్, తిప్పారపు ఉపేందర్, రహమాన్, మండల మోహన్, ఆకుల మహేశ్, నాసగోని శ్రీనివాస్, లావు జైపాల్ రెడ్డి, యండి ఎజాజ్, బట్టమేకల రాజు, మణి, పాలబిందెల రవీందర్, అశీష్, బాలు, అంకుశ్, శ్రీను, జితేందర్, సోమేష్, చింతకింది కిష్టమూర్తి, శివరాం, పర్శరామ్, బాస్కర్, సాగర్, మదు, నవీన్, వేణుగోపాల్, మోహన్, కిరణ్, శ్రీను, ఓంకార్, బాస్కర్ , బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## దాడియాపూర్‌లో నూతన విద్యుత్ ఉపకేంద్రం పనులు ప్రారంభం

ముత్తారం,అక్టోబరు 2 (విజన్ ఆంధ్ర)ముత్తారం మండలం దాడియాపూర్ గ్రామంలో నూతన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జడ్పీటీసీ చొప్పరి సదానందం,గ్రామ సర్పంచ్ రాపెల్లి రాజయ్య పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు,నూతన ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందే అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాడియాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,

## గాంధీజీ కలల గ్రామస్వరాజ్యం దిశగా బారెగూడ అడుగులు: సర్పంచ్ వేణుగోపాల్



కాగజ్‌నగర్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): గాంధీ జయంతి సందర్భంగా బారెగూడ గ్రామపంచాయతీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి సర్పంచ్ కోట వేణుగోపాల్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసుకునే దిశగా బారెగూడ గ్రామం ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా కలిసి పనిచేసినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామ పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలని, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సూచనలు, అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. బారెగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ చూపిన అహింస, సత్యం, స్వచ్ఛత, గ్రామస్వరాజ్య స్ఫూర్తితో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచానికి అహింస, శాంతిని బోధించిన గాంధీజీ

### గాంధీజీ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అదనపు కలెక్టర్ నర్సింగరావు





గద్వాల అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)శాంతియుత మార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించిన గాంధీజీ ప్రపంచానికి మార్గదర్శకుడిగా నిలిచారని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం గద్వాల గాంధీ చౌక్ లోని ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐడిఓసి ఆవరణలో జాతిపిత చిత్రపటానికి పలువురు అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదరపు కలెక్టర్ మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహం, శాంతి సందేశాలతో గాంధీజీ చూపిన మార్గం అనుసరణీయమని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి అనేక ఉద్యమాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ప్రజలందరినీ ఏకం చేసి గాంధీజీ పోరాటాలు చేశారన్నారు. జాతిపిత లాంటి ఎందరో మహనీయుల త్యాగ ఫలాలతో నేడు మనమంతా స్వేచ్ఛ, స్వాతంత్ర్యలతో జీవిస్తున్నామని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాల ఉద్యమానికి అనూహ్య స్పందన

### భారీ సంఖ్యలో తరలివచ్చిన జర్నలిస్టులు



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టి యు డబ్ల్యూ జె ఎచ్చు -143 ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఉత్తరాల ఉద్యమానికి హన్మకొండ జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు కూడా క్యాస్ లెస్ హెల్త్ కార్డులు మంజూరి చేయాలనే డిమాండ్ తో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అల్లం నారాయణ , ఆస్కాని మారుతిసాగర్ రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని హైదరాబాద్ లో ప్రారభించారు. అందులో భాగంగా హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్ లోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో మొదలైన ఈ ఉద్యమం మండల కేంద్రాల్లో కూడా జరుగుతుందని యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన జర్నలిస్టులకు స్వరాష్ట్రంలో అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. హెల్త్ కార్డుల విషయంలోనే కాకుండా ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ ల మంజూరిలో కూడా జర్నలిస్టులకు ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందని అన్నారు. జర్నలిస్టుల క్యాస్ లెస్ హెల్త్ కార్డుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 150 పోస్ట్ కార్డులు రాశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చిలుముల సుధాకర్, బీఆర్ లెనిన్, తడక రాజ్ నారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, యూనియన్ నేతలు కక్కెర్ల అనిల్ కుమార్, పోగాకుల అశోక్, తాళ్లపెల్లి వేణుగోపాల్, పోగాకుల ప్రభాకర్, అల్లం రాజేష్ వర్మ, మైదం సుధాకర్, దుంపల పవన్, గోకారం శ్యాంకుమార్, బుడిగే శ్రీనివాస్, తోట తిరుమల్, మండ సాల్మాన్, సంపేట సుధాకర్, గొట్టె వెంకన్న, బండారి సతీష్, చేతి శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, బొమ్మగాని ఆదర్శ్, దేవేందర్ , కర్నాకర్, సునీల్,శోభనబాబు, రవి తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరు లో ఎర్ర సూర్యుడు నల్ల నరసింహులు

### శత జయంతి ఉత్సవ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి, రాజారెడ్డి



జనగామ,అక్టోబర్ 2(విజన్ ఆంధ్ర): భూమికోసం భుక్తి కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం, దున్నేవానికి భూమి కావాలని సాగిన, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, జెండా ఎత్తిపట్టి, భూ స్వాముల గుండెల్లో గున పాలు దింపిన ఎర్ర సూర్యుడు, కామ్రేడ్ నల్ల నరసింహులు అని జనగామ మాజీ ఎమ్మెల్యే సీపీఐ జనగామ కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ జనగామ జిల్లా కార్యాలయంలో అమరజీవి తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధుడు ఎర్రజెండా ముద్దుబిడ్డ, కామ్రేడ్ నల్ల నరసింహులు శత జయంతి, వారి చిత్రపుటానికి పూలమాల వేసిన అనంతరం పట్టణ కార్యదర్శి కామ్రేడ్ సోప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, నాటి నైజాం రాచరిక, దొరల భూ సామ్య జమీందారు జాగిర్దార్ల పీడిత అణిచివేత, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, దున్నే వానికి భూమి కావాలని జరిగిన రైతాంగ సాయుధ పోరాట చరిత్ర ప్రపంచంలో లిఖించదగినది. అలాంటి పోరాటానికి నాయకత్వం వహించిన నల్లా నరసింహులు 1926 అక్టోబర్ 2వ తేదీన కడవెండి గ్రామంలోజన్మించి కడవెండి, నరహంతక రాపాక రామచంద్రారెడ్డి తల్లి అయిన జానకమ్మ అక్రమ ఆగడాలు అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య దొడ్డి మల్లయ్య తో పాటు నల్ల నరసింహులు ప్రధాన భూమిక పోషించి, భూస్వామ్య రజకార గుండెల్లో సింహ స్వప్నమై ఎర్ర సూర్యుడై, కజగజలాడించును ఘనత నల్ల నర్సింహులుదని రాజారెడ్డి అన్నారు. వారి పోరాట ప్రతిమ నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తుందని, నేటి విద్యార్థి యువత వారి పోరాట చరిత్రను చదవాలని కోరారు. ప్రభుత్వము తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను పాఠ్యాంశాలు చేర్చాలని, నల్ల నరసింహులు విగ్రహం ట్యాంకు బండిపై నిర్మించాలని రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు కామ్రేడ్ ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, జిల్లా నాయకులు సోప్పరి సోమయ్య, మోటే శ్రీశైలం, చామకూర యాకుబ్, ఉప్పల ఐలయ్య, సుదర్శనం, బ్రహ్మాచారి, దయా నగేష్, పార్టీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 ( విజన్ ఆంధ్ర ): జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ల దినోత్సవం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి జర్నలిస్టులు నిరసన తెలిపారు. బ్యానర్ పట్టుకుని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి పూలు సమర్పించి నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి అందజేశారు. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేశారు.కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలిదేశంలో మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి విధానపరమైన సిఫార్సులు చేసేందుకు కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కార విధానాలు, సేవల విరమణకు సంబంధించిన రక్షణలను పునరుద్ధరించాలని కోరారు. ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా భద్రమైన మీడియా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డం కేశవమూర్తి, ఊటుకూరు సీతారామారావు (సాయిరామ్), రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్మోహన్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జిల్లా కోశాధికారి పోలిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ కోశాధికారి బోలా అమర్, జిల్లా కార్యవర్గ ప్రతినిధులు విజయ్ భాస్కర్, గన్ను సంతోష్ కుమార్, రామారావు, ఉస్మాన్ పాషా, వాజీద్, దండు మోహన్, కొమ్మాలు బిక్షపతి, యాదవ్, విజయ్ భాస్కర్, నయీమ్ పాషా, చుక్కారావు, ముదిగిరి ఓదెలు, నల్లాల బుచ్చిరెడ్డి, ప్రమోద్, అల్లే రామారావు, ప్రదీప్, బి. శ్రీహరి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### గాంధీజీ విగ్రహం వద్ద ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన



గద్వాల అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యూజే– ఐజేయూ.రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోనిగాంధీ చౌక్‌లో గాంధీజీ విగ్రహం వద్ద ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు ఎన్ఈసీ తీర్మానం ప్రకారం గాంధీ జయంతిని 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా పాటిస్తూ నిరసన తెలిపి, అనంతరం జిల్లా కలెక్టరేట్ లో డిమాండ్ల తో కూడిన వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ?సమగ్ర మీడియా కమిషన్, నూతన వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి అని,జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర చట్టాలు తీసుకురావాలి అనిరద్దయిన 1955, 1958 వర్కింగ్ జర్నలిస్ట్ చట్టబద్ధమైన రక్షణలను పునరుద్ధరించాలి అని,?కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి అని,?ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే క్యాష్‌లెస్ చికిత్స అందించేలా హెల్త్ కార్డులు ఇవ్వాలి అని తదితర డిమాండ్లను పరిష్కరించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు డిమాండ్ల పత్రాన్ని పంపడం జరిగిందని, అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ.నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### నిట్ వరంగల్‌లో గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి మరియు భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నీట్ ) వరంగల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మహాత్మా గాంధీ, శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, సభను ఉద్దేశించి ప్రసంగించారు. సత్యం, అహింస, నిరాడంబరత, నిజాయితీ, నిస్వార్థ సేవ వంటి వారు ప్రబోధించిన విలువలను విద్యార్థులు తమ విద్యా మరియు వ్యక్తిగత జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు.డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సబ్సిడీతో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు అవకాశం విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం



గద్వాల అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం అన్నారు.పథకం ప్రచారానికై సేవా సేతు అభియాన్ పేరుతో గద్వాల విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద మూడు రోజులపాటు నిర్వహించు శిబిరాన్ని శుక్రవారం రెడ్కో, విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీకి సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది అన్నారు. వినియోగదారులు తమ ఇంటి పైకప్పులపైనే ఈ ఫలకాలను ఏర్పాటు చేసుకొని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చున్నారు. ఆసక్తి గలవారు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని, హెల్ప్ డెస్క్ 040 48526869 నెంబర్ లోను మాట్లాడవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ రవిప్రసాద్, ఏడిఈ రమేష్ బాబు, అకౌంట్స్ అధికారులు రాజు, మదన్, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ చూపిన మార్గంలో నడవాలి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, సత్య శారదలతో కలిసి ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ దేశానికి సత్యం, అహింస, శాంతి, ఐక్యత మార్గాలను చూపించిన మహనీయుడని అన్నారు. ప్రజలందరూ ఐక్యంగా ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలమనే నమ్మకాన్ని గాంధీజీ దేశ ప్రజల్లో కల్పించారని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, ఆయన చేసిన సేవలు, త్యాగాలు భారత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గాంధీజీ చూపించిన మార్గం వల్లనే ప్రజలందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విజయవంతం చేయగలిగామని తెలిపారు. అయితే ప్రస్తుతం బీజేపీ పార్టీ గాంధీజీని తక్కువ చేసి చూపించే విధంగా ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే నాయిని అన్నారు. గాంధీజీ విగ్రహాలకు నివాళులు అర్పిస్తూ మరోవైపు సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వేదికలలో గాంధీ కంటే గాడ్సే గొప్పవారిగా చూపించే ప్రయత్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలను ఎవరెన్ని విధాలుగా ప్రచారం చేసినా చరిత్ర నుంచి చెరిపివేయడం సాధ్యం కాదన్నారు. గాంధీజీ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని అన్నారు. దేశం కోసం సేవ చేసిన ఆ కుటుంబం వ్యక్తిగత ఆస్తులు, సంపద కోసం ఎన్నడూ పోరాటం చేయలేదని, దేశ ప్రయోజనాలకే తమ జీవితాలను అంకితం చేశారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుల కుటుంబాలను ఆదర్శంగా తీసుకుని, సమాజానికి ఉపయోగపడే విధంగా మనమంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీజీ ఆశయాలైన సత్యం, అహింస, సామాజిక సమానత్వం, దేశ ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. నిరాడంబరత, దేశభక్తి, కర్తవ్యనిబద్ధతకు లాల్ బహదూర్ శాస్త్రి ప్రతీకగా నిలిచారని అన్నారు. గాంధీజీ, శాస్త్రిజీ వంటి మహనీయుల జీవితాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంకభూషణం చైర్మన్ వెంకట్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జోగులమ్మ అమ్మవారి కి 100 కేజీల పంచలోహ విగ్రహం బహుకరించిన జైని రామ్మోహన్ దుర్గ దంపతులు

అలంపూర్ అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అలంపురం లోని ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ అమ్మవారికి జైని రామ్మోహన్ దుర్గ దంపతులు శుక్రవారం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల కార్యనిర్వాహక అధికారి దీప్తి సమక్షంలో 100 కేజీల పంచలోహ అమ్మవారి(4 లక్షల రూపాయలు విలువగల)విగ్రహాన్ని బహుకరించారు. జైని రామ్మోహన్ దుర్గ దంపతులకు ఆలయాల అర్చకులు స్వామివారిని, అమ్మవారిని దర్శనం చేయించి ఆశీస్సులు అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాల ఈవో దీప్తి మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించిన అనంతరం నిత్య పూజలు అందుబాటులోకి తీసుకురాగలమని తెలియజేశారు.



# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ముత్తారం, అక్టోబరు 2 (విజన్ ఆంధ్ర)జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు,మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ శాఖల అధ్యక్షులు,వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు,ఎస్సీ,బీసీ,మైనార్టీ సెల్ నాయకులు,కార్యకర్తలు

## మెగా హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2( విజన్ ఆంధ్ర)వడ్డేపల్లిలో దళిత సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మెడికేర్ జనరల్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు , వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు టి .రవీందర్( జే.కె ), కార్యదర్శి టి ప్రవీణ్ కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం, ఉపాధ్యక్షులు టి కొమురయ్య , చేరాలు సుధాకర్ , ఆండాళ్ రాజ్, సహాయ కార్యదర్శులు, దయాకర్ సుధాకర్ శ్రీనివాస్ ప్రవీణ్ అనిల్ చందు, దళిత సంక్షేమ గ్రామ కమిటీ మహిళా విభాగం నుండి అధ్యక్షురాలు గ్రేసమ్మ ,కార్యదర్శి ఝాన్సీ రాణి, పద్మ, మేరీ, దళిత సంక్షేమ గ్రామ కమిటీ యువజన విభాగం నుండి అధ్యక్షులు శరత్, కార్యదర్శి నరేష్, కోశాధికారి రాజకుమార్ ,ఉపాధ్యక్షులు వినయ్, ప్రశాంత్, శంకర్ ,అవినాష్. సహాయ కార్యదర్శులు కిరణ్, దిలీప్, రాజ్ కుమార్, అరవింద్ ప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02,(విజన్ ఆంధ్ర)ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ లో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్-2027కు సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఎటువంటి రుసుము లేకుండా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని, 9వ తరగతి ప్రవేశాలకు https://cbseitms.nic.in/2026/ అజంఆఇఖి9, 11వ తరగతి ప్రవేశాలకు https://cbseitms.nic.in/2026/nvsxi_11 వెబ్ సైట్ల ద్వారా ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 10వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## దసరా నాటికి అమ్మవారి రథం ప్రారంభం

**తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు**
**మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)దసరా పర్వదినం నాటికి భద్రకాళి అమ్మవారి రథాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులను వేగవంతం చేయాలని...వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న మాడవీధుల నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. తొలుత భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న మాడవీధులు, అమ్మవారి రథం పనులను పరిశీలించారు. దసరా ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అమ్మవారి రథానికి సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయని, కళాకారులు రథానికి తుదిమెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. దసరా నాటికి రథాన్ని సిద్ధం చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మాడవీధుల నిర్మాణం పూర్తయితే ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ఉత్సవాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యం, ఆలయ ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్,ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, మిగిలి ఉన్న పనులు, దసరా ఉత్సవాల నాటికి పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కూడా అధికారులు అజిత్ రెడ్డి,భీమ్ రావు,ఆలయ ఈఓ సునీత తదితరులు ఉన్నారు.

# గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు



జనగామ, అక్టోబర్02(విజన్ ఆంధ్ర):గాంధీ జయంతి మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా స్థానిక మహాత్మా గాంధీ ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ, వైటీడిఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, జనగామ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దొర్నాల వెంకటేశ్వర్లు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సందర్భంగా నాయకులు మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాన్ని, దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో మహాత్మా గాంధీ మరియు భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశానికి వారు అందించిన సేవలను, వారి ఆదర్శాలను స్మరించుకుంటూ, వారు చూపిన సత్యం, అహింస, క్రమశిక్షణ, దేశభక్తి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ళ సత్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ ఎర్రమల సుధాకర్, డీసీసీ ఉపాధ్యక్షులు కొత్త కరుణాకర్ రెడ్డి, నూకల బాల్ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు జిల్లాల సిద్ధారెడ్డి, ఎం.డి. అన్వర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లోకుంట్ల ప్రవీణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల మల్లేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాజిద్ అప్సర్, సేవాదళ్ అధ్యక్షులు జాయ మల్లేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరి శివ, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మేకల సమ్మయ్య, డీసీసీ కమిటీ సభ్యులు దామర నాగరాజు, లింగాల రాజేందర్ రెడ్డి, మున్నీ బేగం, వీవర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు సామల పరమేశ్వర్, మోర్తాల ప్రభాకర్, సేవాదళ్ ఉపాధ్యక్షులు లింగాల వెంకటరెడ్డి, నల్ల మహేందర్, ఇస్మాయిల్, మచ్చ ప్రవీణ్, బుర్రలు సిద్ధులు, కళ్యాణం సమ్మయ్య, సందీప్, చింతకింది నరేష్, నోముల సోమయ్య, నోముల రాజు, ఉమామహేశ్వరి, సక్కుబాయి, అనిత, క్రాంతి, జీవరత్నం తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విబిజిరామ్ జి తో పని దినాలు పెంపు

**1 జూలై 2026 నుండి విబిజిరామ్ జి అమలు**
**100 రోజుల నుండి 125 రోజులకు పెంపు**
**మౌలిక సదుపాయాలు కల్పనతోనే గ్రామ అభివృద్ధి**
**తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు పరిష్కరించడం**
**గోధంగూడ గ్రామ సర్పంచ్ నస్కంటి స్వర్ణలత, జిపి సెక్రటరీ ఇంద్రజ**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 ( విజన్ ఆంధ్ర) : వి బి జి రామ్ జి తో ఉపాధి హామీ కూలీల పని దినాలు పెరిగాయని గోధంగూడ గ్రామ సర్పంచ్ నస్కంటి స్వర్ణలత గ్రామపంచాయతీ సెక్రటరీ ఇంద్రజ అన్నారు. ఒకటి జూలై 2026 నుండి వి బి జి రామ్ జి అమలులోకి వచ్చిందని వారు గుర్తు చేశారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోగల గోధంగూడ గ్రామంలో గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. క్షేత్రపాలకుడు కందలి నర్సింలు వి బి జి రామ్ జి పథకం లక్ష్యాలను వివరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ జీవనోపాధి ప్రకృతి విపత్తులు తాగునీరు వీధి దీపాలు పారిశుద్ధ్యం 15వ ఆర్థిక సంఘం నిధులు వంటి విషయాల గురించి గ్రామ ప్రజలకు వివరంగా వివరించారు. క్షేత్రపాలకుడు కందలి నర్సిములు మాట్లాడుతూ గ్రామానికి ఒకటి చొప్పున ఊట కుంటను నిర్మించాల్సి ఉందని అన్నారు. ఫారంపాండ్స్ పనులు కొనసాగాలని గ్రామ సభలో ఆయన ప్రస్తావించారు. ఎల్ నినో ప్రభావం వలన భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉన్నందున ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇంకుడు గుంతల వలన తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన పేర్కొన్నారు. గ్రామ సభలో ఉప సర్పంచ్ మంజుల వార్డు మెంబర్ వినోద్ కుమార్ ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు గ్రామ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని ఎంపీకి విజ్ఞప్తి



నారాయణపేట, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలోని మూడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డీకే అరుణమ్మను వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ విజ్ఞప్తి చేశారు . శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఆమె మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఎంపీడీకే అరుణమ్మను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీలు రోడ్ల, సరస్వతి నగర్ కాలనీలో కూడా రోడ్లు డ్రైనేజీలు నిర్మించేందుకు ,నక్కరామయ్య కాలనీలో బ్రిడ్జ్ ను నిర్మించేందుకు ఎంపీ నిధుల నుండి విడుదల చేయాలని ఆమె ఎంపీ కి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె ఎంపీ డీకే అరుణమ్మకు వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సమస్యల పరిష్కారం కోసం నిధులను కేటాయించాలని కోరారు అంతేకాకుండా ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే మీ వార్డు అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయిస్తానని ఆ నిధుల ద్వారా వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు ఇందుకు వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఎంపీడీకే అరుణమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేత వైస్ చైర్మన్ మంజుల లతోపాటు నాయకులు రతన్ పాండు రెడ్డి సత్య యాదవ్ శ్రీనివాసులు పోషల్ వినోద్ జి ఆర్ రెడ్డి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## 3.38 కోట్ల మందిపై ఇండస్ టవర్స్ సీఎస్ఆర్ ప్రభావం

హైదరాబాద్, అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర) : ఇండస్ టవర్స్ లిమిటెడ్ చేపట్టిన 'సక్షమ్', 'ప్రగతి' సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా ఆర్థిక సంవత్సరం-26లో దేశ వ్యాప్తంగా 3.388 కోట్ల మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపినట్లు ఇండస్ టవర్స్ ఎండీ, సీఈఓ ప్రచూర్ సాహ్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తంగా ఇప్పటివరకు 9 కోట్ల మందికి సీఎస్ఆర్ కార్యక్రమాలను విస్తరించినట్లు పేర్కొన్నారు. డిజిటల్ సమ్మిళితం, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మహిళా సాధికారత తదితర రంగాల్లో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి 15 కోట్ల మంది జీవితాలపై ప్రభావం చూపడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సాధికారతకు తమ సీఎస్ఆర్ కార్యక్రమాలు దోహద పడుతున్నాయని తెలిపారు.

# ప్రపంచానికి ఆదర్శంగా మహాత్మా గాంధీ ఆశయాలు

**గాంధీజీ అనుసరించిన శాంతియుత మార్గంలోనే సమాజాభివృద్ధి సాధ్యం**
**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి**
**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు**
**గాంధీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, తదితరులు**



మహాత్మా గాంధీ విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) మహాత్మా గాంధీ అనుసరించిన మార్గం, ఆశయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతిని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. గాంధీజీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహనీయులు దేశం కోసం చేసిన సేవలు, త్యాగాలను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. శాంతియుతంగా ఏదైనా సాధించగలమని ఆచరించిన గొప్ప వ్యక్తి గాంధీజీ అని పేర్కొన్నారు. గాంధీజీ త్యాగాలు, అందించిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలు, త్యాగాలను భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేశ ప్రధానిగా లాల్ బహుదూర్ శాస్త్రి అందించిన సేవలు ఎంతో గొప్పవని తెలిపారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి యుగ పురుషులని, వారి గొప్పతనం, సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. దేశాన్ని శాంతియుత మార్గంలో స్వరాజ్య సాధనకు కృషి చేసిన మహనీయులు గాంధీజీ అని పేర్కొన్నారు. గాంధీజీ అనుసరించిన మార్గాన్ని, ఆశయాలు, త్యాగాలను ప్రపంచ దేశాలు గుర్తు చేసుకుంటున్నాయని తెలిపారు. గాంధీజీ అనుసరించిన శాంతియుత మార్గం ప్రపంచవ్యాప్తంగా నెల్సన్ మండేలా వంటి నేతలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అదేవిధంగా మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ గొప్ప విజ్ఞానవంతులు, మేధావి అని అన్నారు. 1965 భారత్--పాకిస్థాన్ యుద్ధ సమయంలో ఆయన ఇచ్చిన జై జవాన్.. జై కిసాన్ నినాదంతో దేశాన్ని ఐక్యంగా ఉంచారని అన్నారు. ప్రధానిగా లాల్ బహుదూర్ శాస్త్రి దేశానికి విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, కుడా మాజీ ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలనివిజ్ఞప్తిదీక్ష



నారాయణపేట, అక్టోబర్ 2 ( విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లాలో ఎల్ నినో ప్రభావం వలన ఖరీఫ్ సీజన్ లో అన్ని రకాల పంటలు నష్టపోయాయని తెలంగాణ ప్రభుత్వం నారాయణ పేటను కరువు జిల్లాగా ప్రకటించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా ఊట్కూర్ మండల పరిధిలోనిబిజ్వార్, పులిమామిడి, ఎర్గట్ పల్లి మూడు పొలిమేర్ల పంట పొలాలు కలిసే దగ్గర శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విజ్ఞప్తి దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ నారాయణ పేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, ఈ సంవత్సరం అన్ని రకాల పంటలు నష్టపోయాయి కావున ఎకరాకు నష్టపరిహారం రూపాయలు 25,000 ఇవ్వాలని పత్తి క్వింటాలుకు 10000 రూపాయలకు కొనాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కరువు ప్యాకేజీ ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు.రైతుల అన్ని బ్యాంక్ లో పంట రుణాలు రీషెడ్యూల్డ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తాయప్ప, రమేష్, సప్పటి చిన్న నర్సింహా,విద్యావంతులు దోరోళ్ళ కృష్ణయ్య, వి. శివ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు గ్రామ పాలనాధికారులే

**-గ్రామ పాలనాధికారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాను**
**-ఆయా డిమాండ్లు పరిష్కారమయ్యేలా మా వంతుగా కృషి చేస్తాం**
**-జీపీవోల ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడి**

సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్:2(విజన్ఆంధ్ర)ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు గ్రామ పాలనాధికారులేనని డీసీసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారిదే కీలక పాత్ర అని ఆమె వివరించారు. గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ, సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రథమ మహాసభకు డీసీసీ మాజీ అధ్యక్షురాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించి వీఆర్వో వ్యవస్థను నాశనం చేసిందన్నారు. వాళ్లు చేసే భూ అక్రమాలు వెలుగులోకి రావద్దని ఉద్దేశంతోనే వీఆర్వో వ్యవస్థను తొలగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే, తిరిగి వారి సేవలను వినియోగించుకునేలా గ్రామ పాలనాధికారులుగా నియమించారని ఆమె గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ వారిని మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కొన్ని డిమాండ్లను నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఈ డిమాండ్లను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఆమె హామీ ఇచ్చారు. వాటి పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జీపీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం. చిరంజీవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పృథ్వి రాజ్, జిపివో ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

## సమతుల్య ఎరువులతో నేల ఆరోగ్యాన్ని కాపాడాలి




హైదరాబాద్, అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర) : సమతుల్య ఎరువులు, నానో ఎరువులు, సమగ్ర పోషక నిర్వహణతో నేల ఆరోగ్యాన్ని కాపాడాలని ఐఎఫ్ఎఫ్సీఓ చైర్మన్ దిలీప్ సంఘానీ సూచించారు. రైతు స్వావలంబనతోనే దేశ స్వావలంబన సాధ్యమన్నారు. ఐసీఏ గ్లోబల్ బోర్డు అట్-లార్జ్ డైరెక్టర్‌గా ఎన్నికైన ఆయనను సత్కరించారు. వ్యవసాయ శాఖ ఏపీసీ, ప్రభుత్వ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ ఐఏఎస్, డైరెక్టర్ బి.గోపీ ఐఏఎస్, ఐఎఫ్ఎఫ్సీఓ మార్కెటింగ్ డైరెక్టర్ డా.యోగేంద్ర కుమార్ పాల్గొని ప్రసంగించారు. పిజెటిఎయు డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డా.యాకద్రి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు నానో యూరియా, నానో డిఏపి, నానో జింక్‌పై అవగాహన కల్పించారు. నేల పరీక్షా కేంద్రాల బలోపేతానికి పిజెటిఎయుకు ఐఎఫ్ఎఫ్సీఓ రూ. 42 లక్షలు అందించింది. ఐఎఫ్ఎఫ్సీఓ తెలంగాణ ప్రతినిధి కుప్పా శంకర్, గీత సంఘానీ తదితరులు పాల్గొన్నారు. సంకట హరణ భీమా, రైతు నేస్తం, హరి యూనివర్సిటీతో ఎంఓయు, ఉత్పత్తి ఆవిష్కరణ, సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

**- రైస్ మిల్లర్స్ అధ్యక్షులు బాదం ప్రవీణ్**



ములుగు అక్టోబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహాత్మా గాంధీ చూపిన సత్య, అహింస మార్గంలో వ్యాపార వర్గాలు నడుస్తూ సమాజ సేవ చేయాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మరియు వైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు నేటికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమరవెల్లి హరినాథ్, మాజీ కోశాధికారి ఆరే విజేందర్, వైశ్య ప్రముఖులు కాటన్ రాజు, కొమరవెల్లి సతీష్, నాగరాజు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు.

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 02,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. యావత్తు దేశాన్ని స్వాతంత్ర్య సంగ్రామంలో సంఘటితం చేసి ముందుండి శాంతి, అహింస మార్గాలలో నడిపించారని అన్నారు. గాంధీజీ జీవితాన్ని అందరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. తన జీవితాన్ని మొత్తం భారతదేశ స్వాతంత్ర్యం కొరకు అర్పించారని కలెక్టర్ గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. ప్రతి ఒక్కరు గాంధీజీ చూపిన మార్గంలో పయనించాలని చెప్పారు. సమాజంలోని రుగ్మతల నిర్మూలనలో, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని కలెక్టర్ తెలిపారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ, భారత స్వాతంత్రం కొరకు శాంతి, అహింసా, సత్యం మార్గాలలో నడుస్తూ, గాంధీజీ తన జీవితాన్ని త్యాగం చేశారని వివరించారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని, దేశ అభివృద్ధిలో తమ వంతు సహకారం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ, గాంధీజీ గొప్పతనాన్ని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్రను వివరించారు. ఈ జయంతి వేడుకలలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీల స్పోర్ట్స్ దుమ్మురేపుడు!!

**- రాష్ట్రస్థాయి పోలీస్ మీట్‌లో రామగుండం దళం పతకాల వేట**

**- ఏకంగా 7 మెడల్స్ సొంతం**

**- విజేతలను ఘనంగా సత్కరించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర):
ఖాకీ డ్రెస్సులో లా అండ్ ఆర్డర్ కాపాడటమే కాదు... కోర్టులోకి దిగితే ప్రత్యర్థులను చిత్తు చేయడంలోనూ తాము దిట్టేనని రామగుండం పోలీసులు నిరూపించారు. హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన '5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 (క్లస్టర్--సీ)' పోటీల్లో కాళేశ్వరం జోన్--1 తరపున బరిలోకి దిగిన రామగుండం కమిషనరేట్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో 1 రజతం, 6 కాంస్యాలతో మొత్తం 7 పతకాలు కొల్లగొట్టారు. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్ ఓపెన్ సింగిల్స్‌లో కె. సురేష్ రజత పతకం కైవసం చేసుకోగా, ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కె. సురేష్--కె. విజయ జోడీ కాంస్య పతకం గెలుచుకుంది. ఇక టేబుల్ టెన్నిస్ విభాగంలో ఏకంగా ఐదు కాంస్యాలు సాధించి కమిషనరేట్ ఖ్యాతిని చాటారు. 50ం మిక్స్‌డ్ డబుల్స్‌లో ఏసీపీ ప్రతాప్, డబ్ల్యూపీసీ ఎం. వనిత జోడీ, 40ం సింగిల్స్‌లో పీసీ ఎం. ఉదయ్ కిరణ్, ఓపెన్ ఉమెన్స్ డబుల్స్‌లో డబ్ల్యూపీసీ కె. విజయ, కె. దీప ద్వయం, 40ం ఉమెన్స్ డబుల్స్‌లో డబ్ల్యూపీసీ ఎం. వనిత, కె. విజయ జోడీ, అలాగే 40ం మిక్స్‌డ్ డబుల్స్‌లో పీసీ డి. రాజేందర్, డబ్ల్యూపీసీ ఎం. వనిత జోడీ పోరాడి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు.

*ఒత్తిడిని జయించే ఆయుధం క్రీడలే - సీపీ సందేశం*

శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో విజేతలను శాలువాలతో ఘనంగా సత్కరించిన సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ... "24 గంటల ప్రజాసేవ, నిరంతర బందోబస్తుల ఒత్తిడిని అధిగమించడానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయి. విధుల్లో బాధ్యతగా ఉంటూనే, రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ జెండాను రెపరెపలాడించిన మన సిబ్బంది ప్రతిభ గర్వకారణం అని కొనియాడారు. పోలీస్ శాఖ తరపున క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు మల్లేశం, శేఖర్, రమేష్, సీసీ సందీప్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, సభ్యులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు పౌష్టికాహారం

**- అందించడం కోసమే ప్రభుత్వం**

**- తలిముద్ద (అల్పాహారం) పంపిణీ కార్యక్రమం ఏర్పాటు**

**- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ.**



అచ్చంపేట అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) : అంగన్వాడి చిన్నారులకు పౌష్టికాహారం అందించడం కోసమే ప్రభుత్వం తొలిముద్దు కార్యక్రమాన్ని ప్రారంభించిందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు అచ్చంపేట నియోజకవర్గం లోని బల్మూర్ మండలం మండలంలోని గట్టుతుమ్మన్ గ్రామంలో అంగన్ వాడి కేంద్రం లో శుక్రవారం ఎర్పాటుచెసిన అంగన్ వాడి చిన్నారులకు తొలిముద్ద అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు అదేవిధం గా అచ్చంపేట పట్టణంలోని 18వ అంగన్వాడి సెంటర్లో తొలిముద్దు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా "తలిముద్ద (అల్పాహారం)" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. చిన్నారులకు ప్రతిరోజూ ఉదయం ఉప్మా, కిచిడీ వంటి పౌష్టికాహారాన్ని అందించనున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యతతో అందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.. ఈ కార్యక్రమంలో తాహాశీల్దార్ శ్రీ కాంత్, ఎంపిడిఓ రేవతి రెడ్డి,సిడిపిఓ దమయంతి నాయకులు,గొపాల్ రెడ్డి గిరివర్ధన్ గౌడ్ ప్రజాప్రతినిధులు నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు

# సైదాబాద్‌లో ఆర్.ఎస్. బ్రదర్స్ 20వ మెగా షోరూమ్ ప్రారంభం

**- సినీనటి నిధి అగర్వాల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**- దసరా, వివాహ వేడుకల కోసం ప్రత్యేక వస్త్ర కలెక్షన్లు**



హైదరాబాద్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): వస్త్రప్రియులకు నాణ్యమైన, వైవిధ్యభరితమైన వస్త్రాలను అందిస్తున్న ప్రముఖ వస్త్ర విక్రయ సంస్థ ఆర్.ఎస్. బ్రదర్స్ తన 20వ మెగా షోరూమ్‌ను హైదరాబాద్‌లోని సైదాబాద్, సంతోష్‌నగర్ సర్కిల్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభించింది. ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. విశ్వసనీయత, సంప్రదాయ విలువలు, అధునాతన ఫ్యాషన్లకు ఆర్.ఎస్. బ్రదర్స్ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో స్థానికులు, షాపింగ్ ప్రియులు హాజరయ్యారు. ఆర్.ఎస్. బ్రదర్స్ ఫౌండర్, చైర్మన్ పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా వినియోగదారుల ఆదరాభిమానాలతో తమ సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. వినియోగదారుల ఆశీస్సులతో 20వ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని, సైదాబాద్, పరిసర ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన, విభిన్నమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో ఒకేచోట అందించనున్నట్లు తెలిపారు. ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. రాజమౌళి మాట్లాడుతూ.. సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన నూతన మెగా షోరూమ్ వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని వయసుల వారికి నచ్చే వివిధ రకాల డిజైన్లు, ఫ్యాషన్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఫౌండర్, హోల్‌టైమ్ డైరెక్టర్ టి. ప్రసాదరావు మాట్లాడుతూ.. సైదాబాద్ ప్రాంత వినియోగదారుల అభిరుచులు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంతోష్‌నగర్ సర్కిల్‌లో నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక కుటుంబాలందరూ తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి. ప్రసాదరావు, స్వర్గీయ పి. సత్యనారాయణ స్థాపించిన ఆర్.ఎస్. బ్రదర్స్ సంస్థ వినియోగదారుల విశ్వాసంతో విస్తరిస్తూ వస్తోంది. మహిళలు, పురుషులు, చిన్నారుల కోసం ఆకర్షణీయమైన రంగులు, అధునాతన డిజైన్లతో కూడిన విభిన్న వస్త్రశ్రేణిని అందుబాటులో ఉంచింది. దసరా నవరాత్రులను పురస్కరించుకుని ప్రత్యేక వస్త్ర కలెక్షన్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి పూజలు, పండుగ వేడుకలతో పాటు ఆశ్వయుజ మాసంలో జరిగే వివాహాలకు అవసరమైన వస్త్రాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకుని నూతన షోరూమ్‌ను సందర్శించాలని వినియోగదారులకు ఆహ్వానం పలికారు.

# గాంధీజీ ఆశయాలకు విరుద్ధంగా బీజేపీ పాలన..

**- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం: ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**- అసెంబ్లీ ఆవరణలో మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకల్లో పాల్గొని ఘన నివాళులు**

**- స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ పాత్రను స్మరించుకున్న ఎమ్మెల్యే**

**- ఓటుహక్కును కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని బీజేపీపై విమర్శలు**

**- అక్టోబర్ 2 నుంచి 8 వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'సేవ్ డెమోక్రసీ వీక్**

**- CEC జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టీకరణ**



నిజామాబాద్ అక్టోబర్02:( విజన్ ఆంధ్ర ) : జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, ప్రజాస్వామ్య మార్గాలు నేటి సమాజానికి ఆదర్శమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన సాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. అహింసా మార్గంలో దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీజీ, అంబేద్కర్ వంటి మహానుభావులు దేశానికి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులను అందించారని పేర్కొన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులు అందించిన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రభావితం చేసే విధంగా పాలన సాగిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ద్వారా అర్హులైన పౌరులకు కల్పించిన ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అలాంటి ఓటుహక్కును బలహీనపరిచే చర్యలకు బీజేపీ పాల్పడుతోందని భూపతి రెడ్డి మండిపడ్డారు. ఓటు చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ బచావో.. దేశ్ బచావో'నినాదంతో అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సేవ్ డెమోక్రసీ వీక్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటుహక్కు రక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నాయని వెల్లడించారు. ప్రజల ఓటుహక్కును కాపాడటం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ నెరవేరే వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి స్పష్టం చేశారు.

# ఏసీబీ దాడులు చేసిన మారని తీరు.

**- వసూళ్లకు అడ్డాగా మారిన టౌన్ ప్లానింగ్ విభాగం.**

**- ప్లానింగ్ అధికారుల అండదండలతో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు.**



నిజామాబాద్ అక్టోబర్02:( విజన్ ఆంధ్ర) : అక్రమ వసూళ్లకు నగర ప్లానింగ్ విభాగం అడ్డాగా మారింది. వరుస ఏసీబీ దాడులు చేపట్టిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తీరు మారడం లేదు. అక్రమ నిర్మాణాలకు అండగా నిలిస్తూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కార్యాలయంలోని ప్రధాన అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బంది చేతివాటం రోజురోజుకు మితిమీరిపోతుంది. ఇటీవల నగరపాలక సంస్థ కార్యాలయంలో దాడులు జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో గణాంక విభాగంలోని అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఏసీబీకి చిక్కారు. గతంలోనూ రెవెన్యూ విభాగాల్లో పలువురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం కార్పొరేషన్ లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఒక్కసారి కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతి నిరోధక శాఖకు పట్టుపడకపోవడం చర్చనీయాశీశంగా మారింది. కార్పొరేషన్ లో అత్యధికంగా వసూళ్ల దందా టౌన్ ప్లానింగ్ విభాగంలోనే కానీ అవినీతి అధికారులకు చిక్కకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. నిజామాబాద్ నగరం తో పాటు శివారు ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్న వాటి వెనుక టౌన్ ప్లానింగ్ అధికారుల మామూళ్ల బాగోతం స్పష్టంగా అర్థమవుతుంది. ఏకంగా అసైన్డ్ భూములలో సైతం అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ ప్రాంతంలో గల 443 సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ స్థలంలో ఇప్పటికే జోరుగా ప్రైవేట్ వ్యక్తులు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక అడ్డదారులు అనుమతులు ఇవ్వడం ప్రధాన సూత్రధారిగా టౌన్ ప్లానింగ్ విభాగం నిలిచిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో సాగుతున్నాయన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అదేవిధంగా సుభాష్ నగర్ ప్రాంతంలో ఓ ప్రముఖ వైద్యుడు నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాన్ని నిర్మించిన టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకోకపోవడం విమర్శలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నిరుపేదలు నిర్మిస్తున్న ఇండ్లను ఆగమేఘల మీద కూల్చివేసే అధికారులు బడా బాబుల నిర్మాణాలను మాత్రం అడ్డుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల చేతివాటాన్ని కట్టడి చేయాల్సిన ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వినాయక నగర్ ప్రాంతంలో రోడ్లను ఆక్రమించుకొని నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అంతా సక్రమంగానే ఉన్నాయంటూ కార్పొరేటర్ ఫిర్యాదును బుట్ట దాఖలు చేయడం వారి వసూళ్ల బాగోతాన్ని బట్టబయలు చేస్తుంది. భారీగా మామూళ్లు తీసుకోవడం వల్లే అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు స్థానిక కార్పొరేటర్ వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని స్థానిక కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు.

# 'సేవ్ డెమోక్రసీ'కి కాంగ్రెస్ శ్రీకారం!!

**- అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ వారోత్సవం**

**- ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడితే ఊరుకోం**

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వార్నింగ్**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర):
ఎన్నికల పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో 'సేవ్ డెమోక్రసీ వీక్' దేశవ్యాప్తంగా జరగనుంది. ఈ మేరకు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వేదికగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఉద్యమ ప్రణాళికను రివీల్ చేశారు.
ఏం జరిగింది? : ఏఐసీసీ పిలుపు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో రామగుండంలో కాంగ్రెస్ శ్రేణులు సమరశంఖం పూరించాయి. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ---ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటం, పారదర్శక ప్రక్రియను సాధించడమే కాంగ్రెస్ తక్షణ ఎజెండా అని స్పష్టం చేశారు. ఓటు అనేది కేవలం హక్కు కాదు, డెమోక్రసీకి లైఫ్‌లైన్. ఓటును రక్షించుకుంటేనే దేశం సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు.



యాక్షన్ ప్లాన్: వారం రోజుల షెడ్యూల్ ఇదీ!
డే 1: యూనిటీ మీట్, ప్రెస్ కాన్ఫరెన్స్
ఇండియా కూటమి మిత్రపక్షాలతో జిల్లా స్థాయి జాయింట్ స్ట్రాటజీ మీటింగ్, మీడియా బ్రీఫింగ్.
డే 2: గ్రాస్‌రూట్ మొబిలైజేషన్
గ్రౌండ్ లెవల్‌లో కేడర్‌ను యాక్టివేట్ చేసేందుకు బ్లాక్ స్థాయి సన్నాహక సమావేశాలు.
డే 3: మెగా మార్చ్
కూటమి పక్షాలతో కలిసి జిల్లా వ్యాప్తంగా 'ఓటు బచావో -- దేశ్ బచావో' నినాదంతో భారీ ర్యాలీ. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలు లేదా కలెక్టరేట్ ముట్టడి/నిరసన.
ముగింపు: కాన్‌స్టిట్యూషన్ ప్లెడ్జ్
మార్చ్ ముగింపులో జాతీయ గీతాలాపనతో పాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 (సార్వత్రిక వయోజన ఓటుహక్కు) ను ప్రజల సమక్షంలో చదివి విస్తృత అవగాహన కల్పించడం.
ఫ్రంట్‌లైన్‌లో లీడర్‌షిప్
ఈ ఈవెంట్‌లో పార్టీ లీడర్‌షిప్ అంతా ఏకతాటిపై నిలిచింది. కార్పొరేషన్ ప్రెసిడెంట్ ఎండీ ముస్తఫా, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ నెలికంటి రాము సహా పలువురు కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.

# మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్2,విజన్ ఆంధ్ర : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ లో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకు వచ్చారని అన్నారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ లో ఎ వో యునాస్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి మహాత్మా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా, సిరికొండ మండలం

# సోన్పల్లి లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి

**- 98 గంజాయి మొక్కలు స్వాధీనం**

**- విలువ సుమారు రూ.9.80 లక్షలు**

**- ఎన్ డి పి సి చట్టం కింద కేసు నమోదు**

**- ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్, సిరికొండ ఎస్సై విక్రం ఆధ్వర్యంలో పోలీసులు సోన్పల్లి గ్రామంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోన్పల్లి గ్రామానికి చెందిన నిందితుడు లితోడసం ముయ్య (78)లి తన ఇంటి ముందు భాగంలో అక్రమంగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ సీహెచ్. రమేష్ సదరు ఇంటిపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితుడు తోడసం ముయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయిని సేవించడం, విక్రయించి డబ్బులు సంపాదించేందుకు సాగు చేస్తున్నట్లు వెల్లడించాడు. ఇంటి వద్ద సాగు చేస్తున్న 98 గంజాయి మొక్కలను తొలగించి, సుమారు రూ.9,80,000 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై ఎన్ డి పి సి చట్టం కింద కేసు నమోదు చేసి, గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ సాగు, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గంజాయి పండించిన రవాణా చేసిన వ్యాపారం చేసిన సేవించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు అదేవిధంగా గంజాయి పండించిన రైతులకు ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 150 ఎకరాలకు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని మహాత్ముడికి నివాళులు అర్పించిన ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర)సత్యం, శాంతి, అహింసా మార్గంలో పోరాడి దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన జాతిపిత మహాత్మా గాంధీ గారి జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని గాంధీ పార్క్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ గార్లతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యము కోసం గాంధీజీ అందించిన సేవలు, అహింసా మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , ప్రాజెక్ట్ డైరెక్టర్ సివిఎన్ రాజు,జిల్లా స్పోర్ట్స్ అధికారి దయానంద్ రెడ్డి,ఎం ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం గాంధీ చౌక్ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**- 103 మంది మహిళా రైతులకు 206 క్వింటాళ్ల ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ**

**- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం**



?వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతతో పాటు వారి అభ్యున్నతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. వనపర్తి మండలంలోని మహిళా రైతులకు ఎఫ్ పిఓ ద్వారా 103 మందికి 206 క్వింటాళ్ల ఉచిత వేరుశనగ విత్తనాలను శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మహిళా రైతులు మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందించడం వల్ల మహిళా రైతులపై పెట్టుబడి భారం తగ్గడంతో పాటు వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు. మహిళలు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఉపాధి, వ్యాపారం, వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని రుణాల పంపిణీ. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలో భాగస్వామ్యం పాఠశాల యాజమాన్య కమిటీలకు మహిళా చైర్పర్సన్లుగా అవకాశం, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ, విద్యార్థుల దుస్తుల కుట్టుపని బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించడం. ?మహిళల ఆర్థిక స్వావలంబనతో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవికిరణ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా, ఏవో కురుమయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**- నిరసన దీక్షకు మద్దతు తెలిపిన బీసీ**

**- పొలిటికల్ జేపీసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 2(విజన్ ఆంధ్ర) : ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో తమ వివిధ సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై పూర్తి మద్దతు ప్రకటించారు. ?ఈ సందర్భంగా డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు వంతెనలా పనిచేస్తున్నారని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న విలేకరుల సంక్షేమాన్ని పాలకులు విస్మరించడం సరికాదన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఎలాంటి పరిమితులు లేని ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డులు) కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి బీసీ పొలిటికల్ జేఏసీ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని, సమస్యలు పరిష్కారం కాకపోతే జర్నలిస్టు సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జర్నలిస్టుల కోరికలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, బీసీ పొలిటికల్ జేఏసీ ప్రతినిధులు, సీనియర్ విలేకరులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి లేఖలు

**- పోస్ట్ కార్డు ఉద్యమానికి అనూహ్య స్పందన**

**- భారీ సంఖ్యలో తరలివచ్చిన జర్నలిస్టులు**





శేరిలింగంపల్లి.అక్టోబర్ 2: (విజన్ ఆంధ్ర) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఀఖఔజీ-ఎ-143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన పోస్ట్ కార్డు ఉద్యమానికి రంగారెడ్డి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు కూడా క్యాష్ లెస్ హెల్త్ కార్డులు అమలు చేయాలనే డిమాండ్ తో యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శేరిలింగంపల్లి గుల్మోహార్ పార్క్ పోస్ట్ ఆఫీస్ వద్ద జర్నలిస్టులు పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఫైళ్ల విఠల్ రెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గంట్ల రాజిరెడ్డిలు పాల్గొని జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన జర్నలిస్టులకు స్వరాష్ట్రంలో అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. హెల్త్ కార్డుల విషయంలోనే కాకుండా ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ ల మంజూరిలో కూడ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేస్తుందని అన్నారు. జర్నలిస్టుల క్యాష్ లెస్ హెల్త్ కార్డుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాదిమంది పోస్ట్ కార్డులు రాశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సతీష్ ముదిరాజ్, రాజు సాగర్, జే. కృష్ణ, మహేష్ కుమార్, శివ ముదిరాజ్, పరమేష్, శ్రీకాంత్, కృష్ణ, పులి అశోక్, దేవేందర్, మల్లేష్ కుమార్, కొమురయ్య, కృష్ణ, శ్రీనివాస్, సీతారాం, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 20న ములుగులో రావణాసుర వధ

**- నూతన కమిటీ ఎన్నికకు పిలుపు**



ములుగు అక్టోబరు 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గత 25 సంవత్సరాలుగా ములుగులో నిర్వహిస్తున్న రావణాసుర వధ కార్యక్రమాన్ని ఈ ఏడాది అక్టోబర్ 20న నిర్వహించనున్నట్లు ధర్మ జాగరణ ఉత్సవ సమితి కన్వీనర్ గందే రాజు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం నూతన కమిటీని ఎన్నుకునేందుకు అక్టోబర్ 4, ఆదివారం ఉదయం 10 గంటలకు ములుగులోని బొడ్రాయి కేంద్రం వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది 25వ వసంతాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయని, ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా, భారీ స్థాయిలో నిర్వహించే ఈ ధార్మిక ఉత్సవంలో పార్టీలకు అతీతంగా యువత ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# డిపిఆర్ఓ తీరు మారకపోతే ఖబార్దార్..!

**- ఇటు కలెక్టర్, అటు కమీషనర్ లను సైతం తప్పుదోవ పట్టిస్తున్న వైనం.**

**- జర్నలిస్ట్ హక్కులను కాలేరాస్తే ఊరుకునేది లేదు.**

**- అధికారి తీరుతో మారుమూల, ఏజెన్సీ ప్రాంత జర్నలిస్ట్ లకు తీరని అన్యాయం.**

**- టీయుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. విజయ్ కుమార్, సురేష్ కుమార్.**





నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 02 నాగర్ కర్నూల్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి తీరు, వ్యవహారం వల్ల మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్హత గల జర్నలిస్టులు తీరని అన్యాయానికి గురవుతున్నారని అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇటు జిల్లా ఉన్నతాధికారులను అటు రాష్ట్రస్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని టీయూడబ్ల్యూజేఐజేయు రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ విజయ్ కుమార్ సురేష్ కుమార్లు మండిపడ్డారు. శుక్రవారం ఐజేయు జర్నలిస్టు సంఘం పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా నుండి అంబేద్కర్ కూడలి వరకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం గాంధీ పార్క్ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. అనంతరం బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో జిల్లాలోని జర్నలిస్టులతో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్హతగల జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు రాకుండా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి డిపిఆర్ఓ కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. నిబంధనల మేరకు అర్హతలు ఉన్న జర్నలిస్టులకు సైతం ఉద్దేశపూర్వకంగానే ద్రోహం చేయాలన్న లక్ష్యంతో ఇటు జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా జర్నలిస్టులు తీరని అన్యాయానికి గురవుతున్నారని మండిపడ్డారు. జర్నలిస్టుల స్వేచ్ఛ హక్కులను కాలరాసే అధికారం ఏ ఒక్కరికి లేదన్న విషయాన్ని గుర్తుతెరగాలని సూచించారు. ఇప్పటికైనా డిపిఆర్ఓ తీరు మార్చుకోకపోతే టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు సంఘం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ తాలూకా అధ్యక్షులు సందు యాదగిరి, టౌన్ అధ్యక్షులు బొడ్డుపల్లి మల్లేష్, కొల్లాపూర్ తాలూకా అధ్యక్షులు రాజు గౌడ్, కల్వకుర్తి అధ్యక్షులు కాస్తూరి శ్రీనివాసులు, అచ్చంపేట సాయిబాబా అన్ని నియోజకవర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలుకాల కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చందానగర్‌లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

**- గాంధీజీ ఆశయాలు, సత్యం, అహింస మార్గాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం**

**- పీజేఆర్ స్టేడియంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి .అక్టోబర్ 2: (విజన్ ఆంధ్ర) : చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీ 157వ జయంతిని పురస్కరించుకుని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజా మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సత్యాగ్రహాన్ని ఆయుధంగా చేసుకుని అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని అందించిన మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలు, కార్యాచరణను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

సత్యం.. అహింసే గాంధీజీ సిద్ధాంతాలు

సత్యం, అహింస గాంధీజీ విశ్వసించిన ప్రధాన సిద్ధాంతాలని ఆరెకపూడి గాంధీ తెలిపారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయుడిగా గాంధీజీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. సాధారణ జీవనం, స్వదేశీ వస్తువుల వినియోగం, పరిశుభ్రత, సామాజిక సమానత్వం వంటి విలువలను గాంధీజీ ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. అన్ని మతాలు, కులాలు సమానమేననే సందేశాన్ని సమాజానికి అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఎల్లప్పుడూ అనుసరణీయమని ఆరెకపూడి గాంధీ అన్నారు. దేశ పురోగతికి ఆయన అందించిన సేవలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ముఖ్యంగా నేటి యువత గాంధీజీ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీరామ్ నగర్ కాలనీ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

***స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని కోరిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్***



శేరిలింగంపల్లి.అక్టోబర్ 2: (విజన్ ఆంధ్ర) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ చేపట్టిన సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం లో ఇతర బీజేపీ నాయకులతో కలిసి ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేసి తదనంతరం హాస్పిటల్ లోని రోగులు మరియు సిబ్బంది తో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొచ్చినట్లయితే ప్రభుత్వంతో కొట్లాడి అయిన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని, అప్పుడే వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యాన్ని కాపాడగలమని తెలిపారు. స్వచ్ఛతను కేవలం ఒక్కరోజుకే పరిమితం చేయకుండా ప్రతిరోజూ బాధ్యతగా పాటించాలని, పరిసరాల ప్రాంతాల పరిశుభ్రతను మన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాల ద్వారానే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్,జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్,డివిజన్ అధ్యక్షులు కరణ్ గౌడ్, సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డి, ఎల్లారెడ్డి, రమేష్ యాదవ్, పట్టాభిరామ్,కిషన్, భాస్కర్ రెడ్డి, ఆమని, సరోజ రెడ్డి, లక్ష్మీ, క్రాంతి సాగర్, దయాకర్, కృష్ణ, సుబ్బయ్య, ఎమ్.ఎస్ రెడ్డి మరియు స్థానిక నాయకులు ,ప్రజలు పాల్గొన్నారు.

# ములుగు గడ్డ నుంచే కల్యాణలక్ష్మి ఆవిర్భావం

***పేదింటి ఆడబిడ్డలకు అండగా కేసీఆర్.***



ములుగు అక్టోబరు 02,విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణలో పేద కుటుంబాలకు కొండంత అండగా నిలిచిన చారిత్రాత్మక కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ములుగు గడ్డ నుంచే ఆవిర్భవించిందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో కేసీఆర్ కు కృతజ్ఞత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో మల్లంపల్లి భాగ్య తండాలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక గిరిజన కుటుంబం సర్వం కోల్పోయి ఆడబిడ్డ పెళ్లి ఆగిపోయిందని, విషయం తెలుసుకున్న కేసీఆర్ వెంటనే అక్కడికి చేరుకుని రూ.50 వేల ఆర్థిక సాయం అందించి దగ్గరుండి పెళ్లి జరిపించారని గుర్తు చేశారు. ఆనాటి ఘటనను మనసులో పెట్టుకునే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 అక్టోబర్ 2న కల్యాణలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టి ఆడబిడ్డ పెళ్లి ఏ తండ్రికి భారం కాకూడదనే సంకల్పాన్ని నెరవేర్చారని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి 'మా తండాలో మా పాలన' అనే గిరిజనుల దశాబ్దాల కలను నిజం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత, ములుగు నియోజకవర్గ ఇంఛార్జ్ బడే నాగజ్యోతి, ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి 200 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

## అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి: కేవీపీఎస్ డిమాండ్.



ములుగు అక్టోబరు 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : దళితుల అసైన్డ్ భూములకు పూర్తి హక్కుతో పట్టాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ములుగులోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ దళితులకు ఉన్న 2 శాతం భూమిని కూడా కబ్జాలు చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే చేవెళ్ల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరారు.

# నల్లగండ్లలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలపై స్థానికుల ఆందోళన

***అనుమతులు, నిర్మాణ నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని GHMCకి విజ్ఞప్తి***




శేరిలింగంపల్లి. అక్టోబర్ 2: (విజన్ ఆంధ్ర) నల్లగండ్ల--సెరిలిం గంపల్లి పరిధిలోని నల్లగండ్ల రెసిడెన్షియల్ కాంప్లెక్స్, ఎఖణా లేఅవుట్ స్ట్రీట్, అపర్ణ సైబర్ లైఫ్ ఎదురుగా జరుగుతున్న ఓ నిర్మాణంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి సంబంధించి అనుమతులకు మించి అదనపు అంతస్తులు, సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణానికి సంబంధించిన GHMC అనుమతులు, శాంక్షన్ ప్లాన్, సెల్లార్ వినియోగం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ నిబంధనలు తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లయితే భవిష్యత్తులో పార్కింగ్ సమస్యలు మరింత తీవ్రం కావడంతో పాటు, వర్షపు నీటి నిర్వహణ, భూగర్భ జలాలపై ప్రభావం, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలోనే సంబంధిత అధికారులు స్పందించి, స్థలాన్ని స్వయంగా పరిశీలించి, నిర్మాణ అనుమతులు మరియు సంబంధిత పత్రాలను ధృవీకరించాలని వారు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం ఉన్నట్లు అధికారుల తనిఖీలో నిర్ధారణ అయితే, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు భవిష్యత్తులో పార్కింగ్, పర్యావరణం, భూగర్భ జలాలు తదితర అంశాల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని నల్లగండ్ల వాసులు +ఎవీజ అధికారులను కోరుతున్నారు.

## ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**- టి యు డబ్ల్యూ జే ( ఐజేయు )డిమాండ్.**



ములుగు అక్టోబర్ 02,విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టి యు డబ్ల్యూ జే ( ఐ జే యు) ములుగు జిల్లా అధ్యక్షులు ఎండి షఫీ అహ్మద్ డిమాండ్ చేశారు. డిమాండ్ల దినోత్సవంలో భాగంగా ములుగులో ని జాతీయ రహదారిపై నుండి గాంధీ పార్క్ వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద డిమాండ్లను వినిపించి వినతిపత్రం సమర్పించారు. నూతన మీడియా కమిషన్, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం, నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

## మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

**- అదనపు కలెక్టర్ సంపత్ రావు**



ములుగు అక్టోబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ 1869 అక్టోబర్ 2న గుజరాత్ లోని పోరుబందర్ లో జన్మించారని, సత్యం, అహింస ఆయన సిద్ధాంతాలని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజ్ కుమార్, డీఐఓ అప్పలనాయుడు, జీఎం సిద్ధార్థ రెడ్డి, ఈడీ ధర్మ నాయక్, డీపీఆర్ఓ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీ ఆశయాలకు అనుగుణంగా ములుగు అభివృద్ధి**

**- మున్సిపల్ చైర్మన్ చంద్రకళ.**



ములుగు అక్టోబర్ 02,విజన్ ఆంధ్ర ప్రతినిధి : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ములుగు గాంధీ పార్క్ లో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం చైర్మన్ చంద్రకళ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, స్వావలంబన గ్రామాల లక్ష్యంగా ములుగు మున్సిపాలిటీని తీర్చిదిద్దుతున్నామన్నారు. పారిశుధ్యం, పచ్చదనం, ప్రజా సేవలో ములుగును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా నిలపడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమంలో చైర్మన్ చురుగ్గా పాల్గొని స్ఫూర్తినిచ్చారని స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గాంధీ, శాస్త్రి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**- గౌలిపురలో మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి నివాళులు**



హైదరాబాద్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర): జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా మిత్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గౌలిపురలో ఘనంగా నివాళులర్పించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. అహింసా మార్గంలో భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా, దేశ రెండో ప్రధానమంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన 'జై జవాన్.. జై కిసాన్' నినాదం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. గాంధీ, శాస్త్రి చూపిన మార్గాలు, వారి ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి. కోటేష్, మిట్ట రవీందర్, బి. కార్తిక్ చారి, దుర్గా ప్రసాద్, ఎస్. ప్రణీత్, టి. శ్రీనివాస్, నరేష్ చారి, మధుసూదన్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## ఒకే పాస్ తో మెట్రో ఎక్కండి.. బస్సులో దూసుకెళ్లండి!






తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 2, విజన్ ఆంధ్ర: హైదరాబాద్ నగరంలో ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజూ పడే ఇబ్బందికి తెరపడింది. ఇప్పటివరకు మెట్రోకు ఒక పాస్, బస్సుకు మరో పాస్ అంటూ తిరగాల్సి వచ్చేది. ఇకపై ఆ తిప్పలు తప్పనున్నాయి. ప్రభుత్వం సరికొత్తగా మెట్రో ం ఆర్టీసీ కామన్ పాస్ ను తీసుకొచ్చింది. ఒక్క పాస్ ఉంటే చాలు... మెట్రోలోనూ, ORR లోపల తిరిగే ఏ బస్సులోనైనా హాయిగా ప్రయాణించవచ్చు.

**ఎంతెంత? :** రోజూ మెట్రో, బస్సులో తిరిగే వారి కోసం రోజువారీ పాస్ కేవలం రూ.400 నెల మొత్తం తిరగాలనుకునే వారికి రూ.8500 తో నెలవారీ పాస్. కేవలం బస్సులో తిరిగే వారికి వారం రోజులకు రూ.600 మాత్రమే. ఇంకో విశేషం ఏమిటంటే... దీని కోసం క్యూలో నిలబడాల్సిన పనిలేదు. ప్రభుత్వం శుక్రవారం 'మీ టికెట్' యాప్ ను లాంచ్ చేస్తోంది. ఫోన్ లో యాప్ ఓపెన్ చేస్తే చాలు.. పాస్ మీ చేతిలో!

## జోగులాంబకు 4 లక్షల కానుక - భక్తి చాటుకున్న దంపతులు

**- అలంపూర్ జోగులాంబ ఆలయంలో భక్తి పారవశ్యం**

**- 100 కేజీల పంచలోహ విగ్రహం విరాళం**



తెలంగాణ స్టేట్ బ్యూరో, అలంపూర్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణలోని ప్రసిద్ధ శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయం మరోసారి భక్తుల దాతృత్వానికి వేదికగా నిలిచింది. అమ్మవారిపై ఉన్న అపార భక్తి భావంతో ఓ భక్త దంపతులు భారీ విరాళం అందించి అందరి మన్ననలు పొందారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ దాతలు జైని రామ్మోహన్ - దుర్గా దంపతులు అమ్మవారికి సుమారు 100 కిలోల బరువు కలిగిన పంచలోహ విగ్రహాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించారు. దీని విలువ అక్షరాలా రూ.4 లక్షలు అని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈ విగ్రహాన్ని వారు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో దీప్తి లాంఛనంగా అందజేశారు. అమ్మవారి విగ్రహాన్ని చూసిన భక్తులు, ఆలయ సిబ్బంది ఆ దంపతుల భక్తిని కొనియాడారు.

త్వరలో ప్రాణ ప్రతిష్ట:

ఈ సందర్భంగా ఆలయ ఈవో దీప్తి మాట్లాడుతూ.."జైని దంపతులు అందించిన ఈ పంచలోహ విగ్రహం ఆలయానికి మరింత శోభను చేకూరుస్తుంది. వారికి ఆలయం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే వేద పండితులచే శాస్త్రోక్తంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి, నిత్య పూజలు ప్రారంభిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంతో ఆలయ ప్రాంగణంలో భక్తిభావం వెల్లివిరిసింది.

## దేవాలయాలే టార్గెట్ గా చోరీలు

**- దొంగ అరెస్ట్, రూ.1.65 లక్షల సొత్తు రికవరీ**




తెలంగాణ స్టేట్ బ్యూరో,అమనగల్లు, అక్టోబర్ 2, విజన్ ఆంధ్ర:

అమనగల్లు పరిధిలో దేవాలయాల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నిందితుడి నుండి రూ.1.65 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమనగల్లు పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 264/2026, సెక్షన్లు 331(4), 305(ఎ) దీచీూ కింద కేసు నమోదైంది. విట్టాయిపల్లి గ్రామ శివారు హనుమాన్, పెద్దమ్మ దేవాలయాల్లో సెప్టెంబర్ 29-30 తేదీల్లో చోరీ జరిగినట్లు పూజారి సభావత్ లక్ష్మణ స్వామి ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ విభాగం సహకారంతో దర్యాప్తు చేపట్టి గంటరావుపల్లికి చెందిన పెద్దముక్కల ఈశ్వర్ (38) ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గతంలో పెదకొత్తపల్లి, పానగల్లు, కందుకూరు దేవాలయాల్లో కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు.

స్వాధీనం:

వెండి మీసాలు, కళ్ళు, నోరు, ఇత్తడి దీపాలు, గంటలు, రాగి బిందెలు, బంగారు పూత వస్తువు, ద్విచక్ర వాహనం ాూ22ూ3368 స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించారు. ఈ కేసును డీసీపీ కె.నారాయణ రెడ్డి పర్యవేక్షణలో, ఏసీపీ జానకి రెడ్డి మార్గదర్శకత్వంలో ఇన్స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బృందం ఛేదించింది.

## జాతిపిత మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయం

**- బీఆర్ ఎస్ నాయకుడు డోలి రమేష్**



అల్వాల్, అక్టోబర్ 2, (విజన్ ఆంధ్ర) : శాంతిదూత, జాతిపిత మహాత్మా గాంధీ అని బీఆర్ ఎస్ నాయకుడు డోలి రమేష్ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు డోలి రమేష్ ఆధ్వర్యంలో ఎంజి నగర్ లోని గాంధీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శాంతియుత మార్గంలో భారతదేశానికి స్వాతంత్రం రావడానికి బాపూజీ ఎంతో శ్రమించారని కొనియాడారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్ల సురేష్ పవన్ కుమార్ డప్పు రాజు జావేద్ సతీష్ మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ హరిత ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

**- ?సమగ్ర అధికారాలతో 'మీడియా కమిషన్' ఏర్పాటు చేయాలి**

**- ప్రతి విలేకరికీ ఉచిత హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**- గాంధీచౌక్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ధర్నా**

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేత**









వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 2(విజన్ ఆంధ్ర) : ప్రస్తుత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో సమగ్ర అధికారాలతో కూడిన 'మీడియా కమిషన్'ను ఏర్పాటు చేయాలని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐజేయూ పిలుపు మేరకు మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో జర్నలిస్టుల సమస్యలపై నిరసన ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు ఆధ్వర్యంలో, జిల్లా కార్యదర్శి బి. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మధుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ?ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులను హెల్త్ కార్డులతో అనుసంధానించకపోవడం సరికాదన్నారు. ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు మంజూరు చేసి, క్యాష్‌లెస్ వైద్య సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

***జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలి మాధవరావు***

యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన విలేకరులు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాల్లో పనిచేస్తున్న గ్రామీణ, మండల, జిల్లా స్థాయి జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాడులు, బెదిరింపులను అరికట్టేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ అని పేర్కొన్నారు.

***వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి బి. రాజు***

జిల్లా కార్యదర్శి బి. రాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో విలేకరులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు జాతీయ భద్రతా చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఉద్యోగ భద్రత, వేతనాల సవరణ కోసం నూతన వేజ్ బోర్డును ఏర్పాటు చేసి జర్నలిస్టులతో పాటు జర్నలిస్టేతర ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

***ఎమ్మెల్యే, ఆర్డీవోకు వినతిపత్రం అందజేత***

ధర్నా అనంతరం జర్నలిస్టులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి, ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు విడివిడిగా అందజేశారు.?ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆంజనేయులు సాగర్, కార్యదర్శి నరసింహ రాజు, యూనియన్ నాయకులు బాలస్వామి, వెంకట్ గౌడ్, రాములు, మన్యం, కొంతం రాజేందర్, చిన్నరాజు, నాకొండ యాదవ్, విజయ్, పికిలి రాము, రవికాంత్, కమల్ రెహ్మాన్, నసిరుద్దీన్, వహీద్, పరశురాముడు, బాలరాజు, ధనుష్, పట్టణ అధ్యక్షుడు తైలం అరుణ్ రాజ్, కార్యదర్శి అంజి, వివిధ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్, కృష్ణయ్య, బాలరాజు, శివప్రసాద్, హరీష్, ఖాజా మైనుద్దీన్‌తో పాటు సుమారు 200 మందికి పైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం

**- సత్యం, అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి**

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**- వనపర్తిలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు**



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 02 (విజన్ ఆంధ్ర) : దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటం, ఆయన ప్రపంచానికి చాటిచెప్పిన సత్యం, అహింస, శాంతి మార్గాలు చిరస్మరణీయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రను, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, సామాజిక సమానత్వం కోసం గాంధీజీ చేసిన కృషి అనుపమానమైనదని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. సత్యం, అహింస, సేవ, స్వచ్ఛత వంటి విలువలను ఆచరణలో చూపిన గాంధీజీ ఆశయాలు నేటి తరానికి దిశానిర్దేశం చేస్తాయని చెప్పారు. సమాజంలో సమానత్వం, సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలన్న ఆయన ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడమే గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

కలెక్టరేట్‌లో ఘన నివాళి

అనంతరం వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ?ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ మార్గం నేటి సమాజానికి దిక్సూచి - డిఎస్పీ బాలాజీ

**- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 2 (విజన్ ఆంధ్ర) : సత్యం, అహింస, శాంతి మార్గాల్లో సాగిన మహాత్మా గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం నేటి సమాజానికి దిక్సూచి లాంటిదని జిల్లా డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ అన్నారు. గాంధీజీ 157వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ బాలాజీ, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ?అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి చారిత్రాత్మక పోరాటాల్లో బాపు చూపిన నాయకత్వ పటిమ ఎంతో కీలకమైందని గుర్తుచేశారు. సత్యాన్ని విడవని మహోన్నత నాయకుడిగా అహింసా మార్గంలో దేశానికి స్వేచ్ఛను అందించిన గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులు, పలువురు సబ్ ఇన్ స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం

**- జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- గాంధీ జయంతి సందర్భంగా 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' నిర్వహణ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) : యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్'లో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026' పోటీలను శుక్రవారం పట్టణంలోని అభి ఏరీనా ఇండోర్ స్టేడియంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైభవంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వయంగా బ్యాట్ చేతపట్టి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.?ఈ జిల్లా స్థాయి పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. క్రీడల అభివృద్ధికి సహకరిస్తున్న అభి స్పోర్ట్స్ అరేనా నిర్వాహకులు డాక్టర్ మురళీధర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మూడు రోజుల పాటు పోటీలు

అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో అండర్--15 బాలుర సింగిల్స్, ఓపెన్ పురుషుల సింగిల్స్, ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో ప్రభుత్వ మినీ స్టేడియం, అభి స్పోర్ట్స్ అరేనాలలో ఈ మ్యాచ్‌లు కొనసాగుతాయి. ?ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, తహసిల్దార్ రమేష్ రెడ్డి, అభి స్పోర్ట్స్ అరేనా నిర్వాహకులు డాక్టర్ మురళీధర్, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాంధీ బాటలో మానవతా సేవ

***- వృద్ధాశ్రమంలో ఘనంగా గాంధీ జయంతి***

***- వృద్ధులకు అండగా పెరుమాళ్ళ వెంకటయ్య***



కల్వకుర్తి,అక్టోబర్ 2, విజన్ ఆంధ్ర: "మానవ సేవే మాధవ సేవ" అన్న గాంధీజీ ఆశయాన్ని నిజం చేస్తూ కల్వకుర్తి వృద్ధా శ్రమంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగా యి. పీబీఎస్ అధ్యక్షు లు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పెరుమాళ్ళ వెంకటయ్య ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమం లో శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివా ళి అర్పించారు. కో-ఆర్డినేటర్ బి.పద్మ తో కలిసి వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ... గాంధీజీ చూపిన సత్యం, అహింస, మానవతా విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. వృద్ధులను కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఆహారం, వసతి, వైద్యం, దుస్తులు అందిస్తూ వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# 30 నెలల్లో రూ. 100 కోట్ల సంక్షేమ ఫలాలు

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**- సహాయం కాదు.. ఎమ్మెల్యేగా నా బాధ్యత**

**- నియోజకవర్గంలో రూ. 3,459 కోట్లతో అభివృద్ధి పనులు**

**- బిఆర్ఎస్ హయాంలో సంక్షోభం.. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం**

**- లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర) : వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 30 నెలల్లో దాదాపు రూ. 100 కోట్లకు సంబంధించిన సిఎంఆర్ఎఫ్, ఎల్వోసీ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని వనపర్తి శాసనసభ్యులు తెలిపారు. శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సిఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి తాను పెద్ద కొడుకులా బాధ్యత నిర్వర్తిస్తున్నానని, ప్రజా సేవ చేయడం తన బాధ్యతే తప్ప సహాయం కాదని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో క్యాంపు కార్యాలయంలోకి సామాన్యులను రానిచ్చేవారు కాదని, నేడు ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి ఒక్కరూ సమాన భాగస్వామ్యంతో హాజరవుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 3,459 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 12 వేల కోట్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం రూ. 6,000 కోట్లను భరించిందని గుర్తు చేశారు. ఒక్క వనపర్తి నియోజకవర్గంలోనే 32,000 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ?విద్యాభివృద్ధి కోసం రూ. 600 కోట్లు కేటాయించామని, మెస్ ఛార్జీల పెంపుతో పాటు పాఠశాల దుస్తులు, పుస్తకాలను ముందస్తుగానే అందించామని వివరించారు. అలాగే 500 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోనే ముందుంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలోనే వనపర్తిలో రూ. 240 కోట్లతో ఇండస్ట్రియల్ సెక్టార్‌ను ప్రారంభించబోతున్నామని, దీనివల్ల నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని, గృహప్రవేశం చేసే ప్రతి పేద కుటుంబానికి పెద్ద కొడుకుగా సారె చీర అందిస్తానని చెప్పారు. అలాగే 'మేఘన అభయస్థలం' ద్వారా పేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే రూ. 5,000 చొప్పున ఇచ్చే ఆర్థిక సాయాన్ని తన జీవితాంతం కొనసాగిస్తానని మాట ఇచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం డివైడర్లు, చెరువు కట్టల రివిట్‌మెంట్ల పేరుతో కమీషన్లు దండుకుందే తప్ప పేదలకు ఏమీ చేయలేదని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శించారు. కెసిఆర్ చుట్టూ దొంగలు చేరారని ఆయన కుమార్తె కవిత అనడమే బిఆర్ఎస్ నైజానికి నిదర్శనమని, హరీష్ రావు, కెటిఆర్ వల్ల ఆ పార్టీ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ అనే కారుకు టైర్లు ఊడిపోయి, స్టీరింగ్ విరిగిపోయిందని, ఇక ఆ కారు రోడ్డుపైకి రావడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. ప్రజా పాలనలో సీఎంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో మిగిలిన మూడు హామీలను కూడా త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో వనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, వివిధ మండలాల తహసీల్దార్లు (ఎమ్ఆర్ఓలు), మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ ఎల్ ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, ఘణపురం-పెద్దమందడి మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్‌పేట ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ కు బిగ్ షాక్

## - చేతులెత్తేసిన అభ్యర్థి!



తెలంగాణ స్టేట్ బ్యూరో, నల్లగొండ, అక్టోబర్ 02,విజన్ ఆంధ్ర: నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ముందే ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థే తాను పోటీ చేయనంటూ చేతులెత్తేశారు.

**"నన్ను అడగకుండానే ప్రకటించారు"**

**- సర్వోత్తమ్ రెడ్డి**

కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించబడిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. "అసలు నేను ఎవరినీ టికెట్ అడగలేదు. నా పేరు అభ్యర్థిగా ప్రకటించడం నాకే ఆశ్చర్యం వేసింది. నేను ఎమ్మెల్యేగానే పోటీ చేస్తాను, ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధంగా లేను" అని తేల్చి చెప్పారు. దీంతో పోటీకి ముందే కాంగ్రెస్ చతికిలపడినట్లయిందనే చర్చ జరుగుతోంది.

**రేవంత్ రెడ్డి పాచిక రివర్స్?**

ఈ వ్యవహారం వెనుక సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం ఉందంటున్నారు. పటేల్ రమేష్ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ లైన్ క్లియర్ చేసేందుకే సర్వోత్తమ్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ వచ్చేలా చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అభ్యర్థే తిరస్కరించడంతో రేవంత్ పాచిక రివర్స్ అయిందని కాంగ్రెస్ వర్గాలే అంటున్నాయి. అసలు అభ్యర్థికి సమాచారం కూడా ఇవ్వకుండా పేరు ప్రకటించడంపై కాంగ్రెస్ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి.

**బీసీల్లో వ్యతిరేకత, దానం నాగేందర్ ఎపిసోడ్**

రెండు పట్టభద్రుల స్థానాలు రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంతో బీసీ సామాజిక వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. మరోవైపు రేవంత్ ను నమ్మి కాంగ్రెస్ లో చేరి అనర్హత వేటుతో ఎమ్మెల్యే పదవి కోల్పోయిన దానం నాగేందర్ వ్యవహారం కూడా చర్చనీయాంశంగా మారింది. ఆ స్థానానికి ఎన్నిక జరగకుండా విజయారెడ్డితో పిటిషన్ వేయించి, ఎన్నికల ప్రక్రియను రేవంత్ రెడ్డే అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహం బెడిసికొట్టినట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నాలుగు ఠాణాలు.. కోర్టు.... ఒకే లాయర్!

- మేడిపల్లి నుంచి ఘట్కేసర్ వరకు కేసులు ఒకే గూటికి...?
- జూనియర్ల ద్వారా కేసుల మళ్లింపు నిజమేనా?..
- విందులు, వినోదాలు,గోవా పర్యటనలపై పలు ప్రశ్నలు..?
- పోలీసు--న్యాయవాది పరిచయాలపై స్పష్టత అవసరం...!!







మేడ్చల్ జిల్లా/బోడుప్పల్,అక్టోబర్ 02(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మేడిపల్లి, నాచారం, ఉప్పల్, ఘటకేసర్ పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన కేసుల్లో ఒకే న్యాయవాది పేరు పదేపదే వినిపిస్తుండగా.. ఈ నాలుగు ఠాణాల్లో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసుల్లోనే ఎక్కువగా ఉందనే చర్చ న్యాయవర్గాల్లో సాగుతోంది. కేసులు ఒకే న్యాయవాది వద్దకు వరుసగా ఎలా చేరుతున్నాయి? క్లయింట్లు స్వయంగా ఆయనను ఎంపిక చేసుకుంటున్నారా? లేక జూనియర్ న్యాయవాదుల ద్వారా కేసులు ఒకే సీనియర్ న్యాయవాది వద్దకు చేరుతున్నాయా? పోలీసు సిబ్బందితో ఉన్న పరిచయాలు, విందులు, వినోదాలు, పర్యటనలపై వినిపిస్తున్న ప్రచారానికి కేసుల కేంద్రీకరణకు ఏమైనా సంబంధం ఉందా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.మేడిపల్లి ఠాణాకు సంబంధించిన ఇన్ని కేసులు ఆయన వద్దకే ఎలా వస్తున్నాయి? మిగతా న్యాయవాదులకు కేసులు ఎందుకు రావడం లేదు? అంటూ కొందరు న్యాయవాదులు చర్చించుకుంటున్నట్లు సమాచారం. అయితే ఇది కేవలం న్యాయవర్గాల్లో జరుగుతున్న చర్చ మాత్రమేనా? లేక కోర్టు రికార్డుల్లోనూ మేడిపల్లి కేసుల నేపథ్యంలో సంబంధిత కోర్టు రికార్డులు, వకాలత్ వివరాలు, కేసుల స్వరూపాన్ని పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉందని వాదన వినిపిస్తుంది.

*పోలీసులతో సాన్నిహిత్యం.. చర్చకు కారణమేంటి?*

పోలీసు సిబ్బంది, కొందరు న్యాయవాదుల మధ్య సాన్నిహిత్యంపై కూడా న్యాయవర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. విందులు, వినోద కార్యక్రమాలు, పర్యటనలకు సంబంధించిన అంశాలు కూడా ఈ చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయి.పోలీసులను మచ్చిక చేసుకునేందుకే ఇలాంటి కార్యక్రమాలు అనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిని నిర్ధారించే ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది.పోలీసు అధికారులు, న్యాయవాదుల మధ్య వృత్తిపరమైన పరిచయాలు ఉండటం సహజం. కోర్టు వ్యవహారాల సందర్భంగా ఇరువర్గాల మధ్య నిరంతర సంబంధాలు కూడా ఉంటాయి. అందువల్ల కలిసి కనిపించడం, పరిచయం ఉండటం మాత్రమే ఎలాంటి తప్పిదానికి ఆధారంగా చెప్పలేం.అయితే పోలీసు సిబ్బంది, న్యాయవాదులు కలిసి నిర్వహించినట్లు ప్రచారంలో ఉన్న విందులు, సామాజిక కార్యక్రమాలు, పర్యటనలు వాస్తవంగా జరిగాయా? జరిగితే వాటి స్వరూపం ఏమిటి? వాటికి అధికారిక విధులతో పెండింగ్ కేసులతో ఏమైనా సంబంధం ఉందా? వంటి అంశాలు ఆధారాలతోనే తేలాలి.

*'గోవా టూర్'పై పలు ప్రశ్నలు.....?*

కొందరు పోలీసు సిబ్బంది,న్యాయవాదుల మధ్య గోవా వంటి ప్రాంతాలకు పర్యటనలపై కూడా చర్చ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే కేవలం ప్రచారం లేక గుసగుసల ఆధారంగా ఎవరి వ్యక్తిగత పర్యటనలను కేసుల వ్యవహారాలతో ముడిపెట్టడం సరికాదని గుసగుసలాడుతున్నారు.ఏదైనా కేసు ప్రయోజనం కోసం పర్యటనలు జరిగాయనడం గమన్హారం.

*అసలు ప్రశ్న.. కేసులపై ప్రభావం ఉందా!!*

ఈ మొత్తం వ్యవహారంలో కీలకమైన అంశం వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయా లేదా అనేది కాదు. ఆ పరిచయాల వల్ల ఏదైనా కేసు దర్యాప్తు లేదా న్యాయ ప్రక్రియపై అనుచిత ప్రభావం పడిందా? అన్నదే అసలు ప్రశ్న.అలాంటి ప్రభావానికి సంబంధించిన ఆధారాలు ఉంటే వాటిని సంబంధిత కేసు రికార్డులు, కోర్టు ఆదేశాలు, అధికారిక పత్రాలు, బాధ్యతాయుత వర్గాల వివరణలతో ధృవీకరించాల్సి ఉంటుంది.

*రికార్డులే సమాధానం చెప్పాలి....*

మేడిపల్లి, నాచారం, ఉప్పల్, ఘటకేసర్ పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన కేసుల్లో న్యాయవాదుల హాజరు, వకాలత్ పత్రాలు, బెయిల్ పిటిషన్లు, కోర్టు ఆదేశాలు వంటి బహిరంగంగా లభ్యమయ్యే రికార్డులను పరిశీలిస్తే కేసులు ఒకే న్యాయవాది వద్ద ఎంతమేరకు కేంద్రీకృతమయ్యాయో తెలుసుకోవచ్చు.అదేవిధంగా పోలీసు సిబ్బందితో జరిగినట్లు ప్రచారంలో ఉన్న కార్యక్రమాలపై సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవడం ద్వారా వాస్తవాలు, ప్రచారం మధ్య తేడాను గుర్తించవచ్చు.

# " పిల్లల కోసం సామాజిక మాధ్యమాల్లో మరింత పటిష్టమైన రక్షణ చర్యలకు సుప్రీంకోర్టు చర్యను స్కోప్ సంస్థ స్వాగతించింది"

**- మైనర్లను ఆన్లైన్ దోపిడీ నుంచి రక్షించేందుకు డిజిటల్ వేదికలపై మరింత బాధ్యత అవసరం**

**-స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న.**






హైదరాబాద్, తెలంగాణ । 1 అక్టోబర్ 2026
స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), పిల్లల రక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు తీసుకున్న తాజా చర్యను స్వాగతించింది. సామాజిక మాధ్యమ వేదికలు, ఇతర డిజిటల్ మధ్యవర్తులు మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను తప్పనిసరిగా పాటించేలా చట్టబద్ధమైన రక్షణ చర్యలను ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యంగా, 18 సంవత్సరాల చట్టబద్ధ వయస్సు కంటే తక్కువ ఉన్న మైనర్లు ఇటువంటి డిజిటల్ వేదికలతో స్వతంత్రంగా ఒప్పందాలు చేసుకునే అంశాన్ని కూడా పరిశీలించాలని కోర్టు సూచించింది. తెలంగాణలోని జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల రక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్కోప్ సంస్థ, ఈ పరిణామం డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అత్యవసర అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని పేర్కొంది. పిల్లలు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో, ఆన్లైన్ లైంగిక దోపిడీ, గ్రూమింగ్, సైబర్ వేధింపులు, సెక్స్టార్షన్, బాలల అక్రమ రవాణా వంటి ప్రమాదాలపై ఆందోళనలు పెరుగుతున్నాయని స్కోప్ సంస్థ తెలిపింది. ఆన్లైన్లో ప్రారంభమయ్యే ప్రమాదాలు కేవలం డిజిటల్ ప్రపంచానికే పరిమితం కాకుండా, వాస్తవ జీవితంలో పిల్లలను మోసం, మానిప్యులేషన్, లైంగిక వేధింపులు, దోపిడీ వంటి పరిస్థితులకు గురిచేసే అవకాశం ఉందని స్కోప్ స్పష్టం చేసింది.

*స్కోప్ సంస్థ అధ్యక్షులు డా. బండి సాయన్న మాట్లాడుతూ:*

"నేటి పిల్లలు తమ జీవితంలో గణనీయమైన సమయాన్ని ఆన్లైన్లో గడుపుతున్నారు. అయితే, ఆన్లైన్ ప్రపంచంలో దాగి ఉన్న ప్రమాదాలను పూర్తిగా అర్థం చేసుకునే వయస్సు, అవగాహన వారికి ఎల్లప్పుడూ ఉండకపోవచ్చు. సామాజిక మాధ్యమాలను అధికంగా మరియు తగిన పర్యవేక్షణ లేకుండా వినియోగించడం వల్ల పిల్లలు గ్రూమింగ్, లైంగిక వేధింపులు, ఇతర రకాల దోపిడీలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాలు కేవలం తెరపైనే ఆగిపోవు. పిల్లలను లక్ష్యంగా చేసుకుని మోసం చేయడం, ప్రభావితం చేయడం, చివరకు లైంగిక దోపిడీ మరియు అక్రమ రవాణాకు సంబంధించిన పరిస్థితుల్లోకి నెట్టే అవకాశం ఉంది. ప్రతి బాలుడు సురక్షితంగా, రక్షితంగా ఉండేలా డిజిటల్ వేదికలపై మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, జవాబుదారీతనం అత్యవసరం."

మైనర్లు డిజిటల్ వేదికలపై స్వతంత్రంగా ఖాతాలను సృష్టించి నిర్వహించడంపై, ముఖ్యంగా ఒప్పందాలు చేసుకునే చట్టబద్ధ సామర్థ్యానికి సంబంధించిన వయోపరిమితుల నేపథ్యంలో ఆందోళనలను వ్యక్తం చేస్తూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ (జె ఆర్ సి అలయన్స్) దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు పరిశీలించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా పరిశీలన చేపడతామని కోర్టుకు తెలియజేసింది. ప్రతిపాదిత చట్టబద్ధమైన వ్యవస్థ అమల్లోకి వస్తే, డిజిటల్ వేదికల జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంతో పాటు, భారతీయ చట్టాల ప్రకారం పిల్లల హక్కులు, భద్రతకు తగిన రక్షణ కల్పించేందుకు ఇది ఒక ముఖ్యమైన అవకాశంగా మారవచ్చని స్కోప్ సంస్థ పేర్కొంది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) దేశవ్యాప్తంగా బాలల రక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల విస్తృత నెట్వర్క్. ఇది 782 జిల్లాల్లో సమాజాలు, ప్రభుత్వ శాఖలు, చట్ట అమలు సంస్థల సహకారంతో పనిచేస్తోంది. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక దోపిడీతో పాటు వేగంగా మారుతున్న డిజిటల్ వాతావరణం నుంచి ఉత్పన్నమవుతున్న కొత్త రకాల ప్రమాదాల నుంచి పిల్లలను రక్షించేందుకు జె ఆర్ సి, దాని భాగస్వామ్య సంస్థలు కృషి చేస్తున్నాయి. పిల్లలలో డిజిటల్ అవగాహన పెంపొందించడం, ఆన్లైన్ దోపిడీని నివారించడం, ప్రతి బాలుడికి సురక్షితమైన వాతావరణాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వ అధికారులు, బాలల రక్షణ సంస్థలు, పౌర సమాజ సంస్థలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక సమాజాలతో కలిసి పనిచేయడానికి స్కోప్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

# సరోజినీ దేవి ఆసుపత్రిలో వసూళ్ల దందా!!



*కంటిచూపు కోసం ఆశగా ఆసుపత్రికి వస్తే.. అడుగడుగునా డబ్బుల డిమాండ్లతో పేద రోగులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. కనీసం బెడ్‌షీట్ మార్చాలన్నా, స్ట్రెచర్‌పై తరలించాలన్నా చేతులు తడపాల్సిన దుస్థితి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా ఉన్న కొద్దిపాటి డబ్బులనూ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. వైద్యం కోసం వస్తే అవమానాలు, నిర్లక్ష్యంపై కన్నీటిపర్యంతమవుతు న్న పరిస్థితిపై "విజన్ ఆంధ్ర" ప్రత్యేక గ్రౌండ్ రిపోర్ట్.*

- సర్కారు ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు
- బెడ్‌షీట్ మార్చాలన్నా డబ్బులే
- వార్డులో అడుగడుగునా వసూళ్లు
- డిశ్చార్జ్‌కూ డబ్బుల డిమాండ్
- వార్డుబాయ్‌ల చేతిలో వైద్య పరీక్షలు
- వైద్య సేవలా.. వసూళ్ల వేటలా?
- రోగుల కన్నీళ్లకు బాధ్యులెవరు?
- కెమెరా ముందు హడావుడి... గ్రౌండ్‌లో నిల్
- సూపరింటెండెంట్, ఆర్ఎంవోలపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం




హైదరాబాద్ ( ఇన్వెస్టిగేషన్ డెస్క్), అక్టోబర్ 2:
కంటి వెలుగు ఆసుపత్రిలో... కాసుల చీకటి. కళ్లు కనిపించని వృద్ధుడి చేయి పట్టుకుని వార్డులోకి తీసుకెళ్లడానికి కూడా 'చేతి చమురు' వదలాల్సిందేనా?చూపులేని అభాగ్యులకు వెలుగులు పంచాల్సిన చారిత్రక 'సరోజినీ దేవి కంటి దవాఖాన'లో ఇప్పుడు విలువల చూపు మందగించింది. పైసలిస్తేనే పలకరింపు, లేదంటే ఛీత్కారం. సర్కారు వైద్యం ఉచితమని నమ్మివచ్చే పేదల గుండెల్లో నయా పైసల దోపిడీ సూదిలా గుచ్చుకుంటోంది.

**అడుగడుగునా 'చేతివాటం'... ప్రతి పనికి బేరం!**

**బెడ్ షీట్ మారాలన్నా లంచమే**

పేషెంట్ పడుకునే బెడ్ షీట్ మార్చాలన్నా, చెత్తతో నిండిన వార్డు తుడువాలన్నా ఆయాల జేబులు నింపాల్సిందే.
టాయిలెట్లకు తాళాల బేహారం ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో ఉన్న వాష్‌రూమ్‌లు శుభ్రం చేయాలని ప్రాధేయపడితే, కనీస మానవత్వం లేకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.
ఆపరేషన్ థియేటర్ వద్ద 'టోల్ గేట్'లి శస్త్రచికిత్సకు ముందు పేషెంట్ డ్రెస్ ఇవ్వాలన్నా పైసలే. ఆపరేషన్ ముగిసి ఒంటికంటితో బయటకు వచ్చినప్పుడు స్ట్రెచర్ దింపేందుకు బేరం. డిశ్చార్జ్ అయి ఇంటికెళ్లేప్పుడు ఇచ్చే 'నజరానా' ఇవ్వకపోతే చేతికి ఫైలు కూడా రాని దుస్థితి.

**టెస్టులు వీళ్లా చేసేది? వార్డ్ బాయ్‌లే 'డాక్టర్లు'!**

ఆసుపత్రిలో అత్యంత నిర్లక్ష్యపూరితమైన, భయానకమైన అంశం ఇంకొకటి ఉంది. అత్యంత సున్నితమైన కంటి శస్త్రచికిత్సల ముందు బీపీ, షుగర్ పరీక్షలు ఎంత కచ్చితంగా ఉండాలో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ ఇక్కడ వార్డ్ బాయ్స్ , షుగర్ మిషన్, బీపీ మిషన్ పట్టుకుని హడావుడి చేస్తున్నారు.
మెడికల్ రికార్డులను రాయడం, రీడింగులు నమోదు చేయడం వంటి కీలక బాధ్యతలను అర్హత లేని కిందిస్థాయి సిబ్బందికి వదిలేశారు. రేపు ఏదైనా తేడా జరిగి ఒకరి చూపు పోతే బాధ్యత ఎవరిది? అధికారుల నిర్లక్ష్యమా లేక దేవుడిపై నెపం వేస్తారా?

**రోగులు కాదు... భారంగా చూస్తున్న నర్సులు!**

'సేవ' అన్న పదానికి అర్థం మార్చేస్తూ కొందరు నర్సులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. వయసు మళ్లిన వృద్ధులు, చూపు సరిగా ఆనక తడబడుతూ ఏదైనా సందేహం అడిగితే విసుర్లు, శాపనార్థాలే సమాధానాలు. మనుషులను కనీస గౌరవంతో కాకుండా, ఏదో పనికిరాని వస్తువులను చూసినట్లు ఈసడించుకుంటున్నారు.
ఆ చీకటి గదిలో నిస్సహాయ కళ్లులి పల్లెల నుంచి చిల్లిగవ్వ లేక, కంటి చూపు దక్కితే చాలని ఆశతో వచ్చిన ముసలమ్మల చేతుల్లోని పది, ఇరవై రూపాయల నోట్లను కూడా గుంజుకుంటున్న తీరు వ్యవస్థకే మాయని మచ్చ.

**కెమెరా ముందు హడావుడి... గ్రౌండ్‌లో నిల్!**

ఆసుపత్రిలో ఇంత బాగోతం జరుగుతున్నా సూపరింటెండెంట్, ఆర్ఎంవో మాత్రం ఏసీ గదులకే పరిమితమై ఫోటోలకు ఫోజులివ్వడంలో పోటీపడుతున్నారు. రోగుల బాధలు, సిబ్బంది చేతివాటం వీరి కంటికి ఏమాత్రం కనిపించకపోవడం వ్యవస్థ దిగజారుడుతనానికి నిదర్శనం. పరిపాలనపై కనీస పట్టు లేకపోవడంతో వార్డుల్లో అక్రమాలు రోజూ యథేచ్ఛగా సాగుతున్నాయి. తనిఖీల పేరుతో కెమెరాల ముందు ప్రదర్శించే హడావుడి తప్ప, గ్రౌండ్ లెవెల్‌లో పాలన పూర్తిగా శూన్యమైంది. ఇప్పటికైనా ఈ పెద్దలు తమ ప్రచార యావ పక్కనపెట్టి వార్డుల్లోని పేషెంట్ల కష్టాలు అడిగి తెలుసుకోవాలి.
సర్కారు ఖజానా నుంచి కోట్ల రూపాయలు నిధులు వస్తున్నా, పేషెంట్లకు మాత్రం ఈ 'కాసుల రాబందుల' పీడ తప్పడం లేదు. ఉన్నతాధికారులు కళ్లు తెరిచి ఆయాలు, వార్డ్ బాయ్స్ అక్రమాలపై మెరుపు తనిఖీలు చేపట్టాలి. వార్డ్ బాయ్స్ మెడికల్ పరీక్షలు చేయడంపై విచారణ జరిపి, లంచాలు మరిగిన కిందిస్థాయి సిబ్బందిపై, నిర్లక్ష్యపు నర్సులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే, పేదలకు సరోజినీ దేవి ఆసుపత్రి చూపునిచ్చే ఆలయం కాదు... నిలువుదోపిడీ చేసే నరకంలాగే మిగిలిపోతుంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# గుండె ఆగిపోకముందే మొదలైన బేరం..!!

- ప్రాణం పోతే మాకే చెప్పండంటూ రాబందుల వేట
- గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో కన్నీటి సుడిగుండం
- ప్రైవేట్ అంబులెన్స్ కమిషన్ల దందాపై భగ్గుమన్న బాధితులు
- భరోసా చావకముందే.. కాసుల కక్కుర్తికి కళ్లెం వేయండి




పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 2 (విజన్ ఆంధ్ర):
ఆస్పత్రి గుమ్మం తొక్కే ప్రతి సామాన్యుడి కళ్లలోనూ ఒకటే ఆశ... 'మా వాడికి ఏమీ కాదు, ప్రాణం దక్కుతుంది' అని. కన్నీటి తడితో దేవుడిలాంటి డాక్టర్లను నమ్ముకుని ప్రభుత్వ ఆస్పత్రి మెట్లు ఎక్కిన ఆ నిరుపేద కుటుంబానికి అక్కడ ఎదురైన అనుభవం గుండెల్ని పిండేసింది. ప్రాణం కొట్టుమిట్టాడుతుంటే ఊరడించాల్సిన చేతులే, కాటికి మోసుకెళ్లే బేరసారాలు మొదలుపెట్టాయి. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మనుషుల ప్రాణాల కంటే కమిషన్ల కాసులకే విలువెక్కువైందనే చేదు నిజం మరోసారి బట్టబయలైంది. వార్డులో చికిత్స పొందుతున్న రోగి ఆయువు కోసం కుటుంబ సభ్యులు క్షణమొక యుగంలా ఎదురుచూస్తుంటే, అక్కడే పనిచేస్తున్న ఒక సిబ్బంది మాత్రం మరణాన్ని ముందుగానే ముందస్తు బుకింగ్ చేసుకునే ప్రయత్నం చేయడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

*మనిషి పోతే మాకే చెప్పు..' ఇదేం రాక్షసత్వం?*

పేషెంట్ పరిస్థితి విషమిస్తే వెంటనే మాకే సమాచారం ఇవ్వండి అంటూ సదరు కాంట్రాక్టు ఉద్యోగి నిస్సిగ్గుగా రోగి బంధువుల చెవిలో ఊదిన మాటలు వారి గుండెల్లో ఈటెల్లా దిగాయి. ప్రాణం కాపాడాలని చేతులెత్తి మొక్కుతుంటే, రోగి ఎప్పుడు చనిపోతాడా, శవాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌కు అప్పగించి కమీషన్ ఎలా జేబులో వేసుకుందామా అన్న ఆలోచనే తప్ప ఆ మాటల్లో కనీస మానవత్వం కనిపించలేదు. ఈ దారుణాన్ని తట్టుకోలేక రోగి బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలోనే ఆక్రందనలతో ఆందోళనకు దిగారు. "బ్రతికించడానికి వచ్చామా.. శవాల మీద పైసలు ఏరుకునే మీ దందాలకు బలికావడానికి వచ్చామా?" అంటూ వారిచ్చిన నిలదీతకు ఆస్పత్రి పరిసరాలు ఒక్కసారిగా నిశ్చేష్టమయ్యాయి.

*ఉచిత వాహనాలు ఉన్నా.. ప్రైవేట్ రాబందులకే గిరాకీ!*

నిరుపేదల కోసం ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచితే, కొందరు స్వార్థపరులు ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులతో చేతులు కలిపి కమిషన్ల నెట్‌వర్క్‌ను నడుపుతున్నారనేది బహిరంగ రహస్యం. ప్రాణం పోయిన క్షణంలో పుట్టెడు దుఃఖంలో ఉండే బాధితుల బలహీనతను ఆసరాగా చేసుకుని, వేలకు వేలు గుంజే ప్రైవేట్ వాహనాలకు శవాలను అప్పగించే ఈ క్రూరమైన మాఫియా వెనుక ఉన్నదెవరు?

*వైద్యం మీద నమ్మకం చావకముందే చర్యలు తీసుకోండి!*

మరణం కోసం ఎదురుచూసే ఇలాంటి చీడపురుగుల వల్ల పేదవాడికి ప్రభుత్వ వైద్యంపై ఉన్న కాస్త నమ్మకం కూడా ఆవిరైపోతోంది. రోగి బంధువులతో బేరసారాలు ఆడిన సదరు ఉద్యోగిపై, ఈ దందా నడుపుతున్న అంబులెన్స్ ముఠాపై తక్షణమే ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబంతో పాటు స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. దేవుళ్లుగా ఉండాల్సిన చోట దయ్యాల్లాంటి మనుషుల ఆగడాలకు ఇంకెప్పుడు తెరపడుతుందో వేచిచూడాలి.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.